ఆదివారం

4 ఆగస్టు, 2024

వార్త



# తెగిపోతున్న 'తీగ'లు!



# వెంకటేశ్ కొత్త సినిమా

టాలీవుడ్‌లో
తెరకెక్కుతున్న

# 'సంక్రాంతికి కలుద్దాం'!




ప్రాజెక్టుల్లో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా ఒకటి. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాలు బ్లాక్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. సో, ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న మూడో సినిమా కచ్చితంగా హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని.. టాక్ వినిపిస్తోంది.
పూర్తి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాకు 'సంక్రాంతికి కలుద్దాం' అనే టైటిల్ ఖాయమైనట్లు సమాచారం. వెంకటేశ్ నుంచి మరోసారి కుటుంబ కథా చిత్రం రాబోతుందని అభిమానులు మస్తు ఖుషీ అవుతున్నారు.

ఇందులో మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్‌లు హీరోయిన్లుగా నటిస్తున్నారు. స్టార్ ప్రొడ్యూసర్ దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కానున్నట్లు తెలుస్తోంది.

## తారాతీరం

# ఆగస్టులో 'మిస్టర్ బచ్చన్' విడుదల



మాస్ మహారాజ రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్' షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రం నుండి ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, వీడియో గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది.
ఈ సినిమాలో అందాల భామ భాగ్యశ్రీ బోర్సె కథానాయికగా నటిస్తుండగా, జగపతిబాబు విలన్ పాత్రలో కనిపించనున్నారు.
మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టులో విడుదల కానుంది.

ఆదివారం వార్త
4 ఆగస్టు, 2024

## మంచి ముత్యాలు

ఏకాంతంలో ప్రతిభ అభివృద్ధి చెందినట్లే, ప్రపంచపు రణగొణ ధ్వనుల మధ్య వ్యక్తిత్వం ఎదుగుతుంది.


- గోథ

## విషయ విశేషం

స్త్రీలను కించపరిచే పాత్యాంశాలు.. 4
'సంఘీ'భావం....5
క్రీడల ఊసే లేని విద్యాసంస్థలు
కవర్ స్టోరీ..6
తెగిపోతున్న 'తీగ' లు!
అందాల మనాలీ...10
ఈవారం కవిత్వం..12
కమతం
'సివిక్ సెన్స్' సన్నగిల్లుతోందా!...14
అమెరికాలో జీవనవిధానం....18
కథ.. 20
మట్టికులం
సాహిత్యం..23
పూలరేకుల సొగసు తెలుగు
యోగ్యతనెరిగి దానం...26
సంపద పెరగాలంటే?... 29
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### చిన్నతనంలో బాగుంటేనే!



'పని ఒత్తిడి ఎక్కువగా ఉంది. వ్యాయామం చేయడానికి సమయం లేదు. అప్పుడప్పుడూ రిలాక్స్ కావడం కోసం స్మోకింగ్, డ్రింకింగ్ లేదు. అప్పుడప్పుడూ రిలాక్స్ కావడం కోసం స్మోకింగ్, డ్రింకింగ్ చేస్తే తప్పేముంది' అనుకునే యువకులా మీరు..అయితే ఈ పరిశోధన మీ కోసమే. 18-25 ఏళ్ల వయసులో వ్యాయామానికి దూరంగా ఉంటూ దురలవాట్లకి బానసయ్యేవారిలో తరచూ ఇన్‌ఫెక్షన్స్ వస్తుంటాయి. అవన్నీ కలిసి శరీరంలో వాపు స్వభావాన్ని (ఇన్‌ఫ్లమేషన్) పెంచుతాయి. కుర్రతనంలో చాలా ఇన్‌ఫ్లమేషన్ ఎక్కువగా ఉన్నవాళ్లలో నడివయసుకి వచ్చేటప్పటికల్లా మెదడు పనితీరు క్షీణిస్తోందని చెబుతున్నారు శాన్‌ఫ్రాన్సిస్కో యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియా శాస్త్రవేత్తలు. అంటే, అరవై యేళ్ల తర్వాత వచ్చే అవకాశం ఉన్న డిమెన్షియా లక్షణాలు వీళ్లలో నలభైయేళ్లకే మొదలవుతాయట. 18-30 ఏళ్లమధ్య వయసున్న సుమారు 2500 మందిని ఎంపిక చేసుకుని 18ఏళ్లపాటు వాళ్లని పరిశోధించాక ఈ విషయం చెబుతున్నారు శాస్త్రవేత్తలు. వ్యాయామానికి దూరమై దురలవాట్లకు దగ్గరైన వాళ్లలో శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్‌ని సూచించే సి-రియాక్టివ్ ప్రొటీన్ (సిఆర్‌పీ) ఎక్కువగా ఉండటం గమనించారట. 'డిమెన్షియా వంటి సమస్యలు వయసుతోపాటు వచ్చే అనారోగ్యాల వల్లే కాదు, దానికి బీజం కుర్రతనంలోనే పడుతుంది అనడానికి ఇదే సాక్ష్యం' అంటున్నారు శాస్త్రవేత్తలు.

#### మైగ్రేన్‌కి కారణం అవేనట

ప్రపంచ జనాభాలో పదిశాతం మైగ్రేన్‌తో బాధపడుతున్నారని చెబుతారు. వాళ్లలోనూ నాలుగుశాతం మందికి తలనొప్పి రావడానికి ముందు 'ఆరా' అన్న అనుభవం ఉంటుంది. కళ్లముందు మెరుపులేవో వచ్చినట్టు ఉండటం, చూపుబైర్లు కమ్మడం, శరీర భాగాలు కొన్ని మొద్దుబారినట్టు అనిపించడం..వీటినే ఆరా అంటారు. ఈ అనుభవమే ఇప్పుడు మైగ్రేన్‌ని పట్టిచ్చేస్తోంది. ఇప్పుడున్న వాటికన్నా సమర్థమైన మందులు రావడానికి ఇది కారణమవుతోందని చెబుతున్నారు పరిశోధకులు. కొన్నిసార్లు ఈ సీఎస్‌ఎఫ్ ద్రవంలోకి ఓ డజను సమస్మాత్మక ప్రొటీన్‌లు వచ్చి చేరుతుంటాయట. ప్రొటీన్‌లని అడ్డుకునే మందుల్ని ఇప్పటికే గుర్తించామంటున్నారు శాస్త్రవేత్తలు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



వరుసగా జరిగిన మానవవాదుల హత్యలు, హేతువాదులపై దాడులు, ఆలోచనాపరులైన రచయితలపై ఒత్తిళ్లు, నోట్లరద్దు, జియస్‌టి, బ్యాంకుల దివాలా, రైతుల లాంగ్‌మార్చ్‌వంటి వన్నీ భవిష్యత్తు చీకటిగా ఉండబోతోందని హెచ్చరిస్తున్నాయి.

# స్త్రీలను కించపరిచే పాఠ్యాంశాలు

డాక్టర్ దేవరాజు మహారాజు

ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. అందుకు కారణం కేంద్రమంత్రుల ఉపన్యాసాలు ఒక కారణమైతే, వివిధ రాష్ట్రాలలో పాఠ్యపుస్తకాలలోని అంశాలు మరొక కారణం! దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పాఠశాలల పాఠ్యపుస్తకాల్లో అసంబద్ధమైన అంశాలు, అసత్యాలు ఎలా చోటు చేసుకున్నాయో గమనించండి. పదమూడు, పదిహేను సంవత్సరాల మధ్య వయసున్న బాలబాలికలకు తప్పుడు సమాచారం అందించడమంటే, వారిని తప్పుడు వ్యక్తులుగా తయారు చేయడమే కదా? గుజరాత్‌లో యాభైవేలమంది చదువుకునే ఒక సామాన్యశాస్త్ర పాఠ్యగ్రంథంలో రెండవ ప్రపంచయుద్ధం జరుగుతున్న సమయంలో జపాన్, అమెరికాపై అణుయుద్ధం ప్రకటించిందని ఉంది. వక్రీకరించచన చారిత్రక అంశాలు చదువుకుని భావిభారత పౌరులు ఎలా తయారవుతారన్నది ఆందోళన పడాల్సిన విషయం. రాజస్థాన్‌లో బోధిస్తున్న ఒక పాఠ్యగ్రంథంలో స్త్రీలను కించపరిచే పదాలను వాడారు. ఆ విషయాన్ని కిందిస్థాయి నుండి పైస్థాయి అధికారుల దాకా అందరూ ఆమోదించారు. కాస్త సున్నిత మనస్సులు, ఇంగితజ్ఞానం ఉన్న ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు ఎవరైనా ఉంటే ఆపాఠం పిల్లలకు ఎలా చెపుతారు? మనసు చంపుకుని ఉద్యోగ ధర్మంగా, పాఠం చెప్పడమంత శిక్ష మరొకటి ఉండదు కదా? 'పిల్లల పాఠంలో అలాంటి అంశం ఎందుకుందని' ఒక జాతీయ పత్రికా విలేకరి సంబంధిత అధికారిని అడిగితే 'ఏదో పిల్లలకు కాస్త సరదాగా ఉంటుందని అలా పెట్టి ఉంటారని, అదో పెద్ద విషయమా?' అని ఎదురు ప్రశ్నించారు. పాలకులకు కూడా ఇవేవీ పట్టవు. వీళ్లంతా ఆధునిక మనువాద ప్రతినిధులన్నమాట!



సెంట్రల్ బోర్డ్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్‌ఇ) పాఠ్యపుస్తకంలో పది, పదకొండేళ్ల పిల్లలు చదువుకునే పుస్తకంలో మాంసాహారం తినేవారి వల్ల సమాజంలో దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఉంది. మాంసాహారం తీసుకునేవారు అవలీలగా అబద్ధాలు చెపుతారని, ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోరని, అల్లరు, అలజడులూ సృష్టిస్తారని, ముఖ్యంగా లైంగిక దాడులకు పాల్పడుతారని, వారికి నిజాయితీ నిబద్ధత ఉండవని, ఊరికే ఆవేశపడి బూతులు మాట్లాడుతారని ఉంది. ఇలా దోషాలన్నీ మాంసాహారులకు అంటగట్టి పసిమనసుల్ని ప్రభావం చేయడం ఏం సబబు? ఏ ఆహారం తీసుకుంటే ఏఏ లాభాలున్నాయి? ఎందులో ఎన్ని నష్టాలున్నాయి? అనేది శాస్త్రీయంగా వివరించాలి. ఆహారం ఎంచుకునే స్వేచ్ఛ పిల్లలకు ఇవ్వాలి. అంతేగాని, నైతికంగా దిగజారిన వారి లక్షణాలన్నీ గుదిగుచ్చి మాంసాహారులకు ఆపాదిస్తే, అది నిజమైపోదు కదా? ఒకరకంగా చూస్తే మాంసాహారులు, శాఖాహారులు ప్రపంచంలో సమానంగా ఉండి ఉంటారు. లేదా మాంసాహారుల సంఖ్యే ఎక్కువగా ఉండి ఉంటుంది. అట్లని శాఖాహారులంతా సచ్ఛీలురు, సత్ప్రవర్తన గల మహనీయులు కాదు గదా? ఈ విషయమే సిబిఎస్‌ఈ డైరెక్టర్‌ని

(మిగతా 11వ పేజీలో)

## 'సంఘీ' భావం



# క్రీడల ఊసే లేని విద్యాసంస్థలు

అంతర్జాతీయ క్రీడా వేదికల్లో, ఒలింపిక్స్ వంటి అత్యున్నత క్రీడా సంబరాల్లో మన దేశం ఆశించిన మేరకు ప్రతిభను కనబ రచలేకపోతోంది. మన కంటే చిన్న దేశాలు విజయపతకాలు సాధిస్తుంటే భారత క్రీడాకారులు వారితో తలపడలేక వెనుకబడి పోతున్నారు. మనదేశ క్రీడాకారుల్లో ఎంతోమంది మెరికల్లాంటి వారు ఉన్నారు. వీరికి సరైన తర్ఫీదును ఇస్తే భారతదేశ సత్తాను అంతర్జాతీయ స్థాయిలో కనబరిచేందుకు సిద్ధంగా ఉన్నారు. క్రీడల అంశాన్ని పరిశీలించే సమయంలో ప్రభుత్వాల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. సరైన క్రీడా మైదానాలు అందుబాటులో లేకపోవడం, క్రీడాకారులకు పూర్తిస్థాయిలో వనరులు కల్పిస్తూ నిధులు ఖర్చు చేయలేకపోవడం వంటివి స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరోపక్క క్రీడా సంఘాలపై రాజకీయ ప్రభావం అధికంగా ఉంటోంది. రాజకీయ ప్రాభల్యంతో సంఘాలను ప్రాతినిధ్యం వహించే వారికి క్రీడలపై కనీస పరిజ్ఞానం ఉండటం లేదు. క్రికెట్‌బాల్‌కు, బాస్కెట్ బాల్‌కు తేడా తెలియని వారు సైతం క్రీడా సంఘాలపై అజమాయిషీ చెలాయిస్తున్నారు. ప్రతిభ కలిగిన, సమర్థులైన క్రీడాకారులను ఎంపి క చేసే సమయంలో కూడా పారదర్శకత ఉండటం లేదు. ప్రధానంగా క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తారు. వీరికి సరైన మార్గదర్శకం చేసే వారు గాని, ప్రోత్స హించే వారు కాని ఉండటం లేదు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో ఆటలపై ఆసక్తి పెంపొందించేందుకు తగిన వాతావ రణాన్ని కల్పించాలి. చిన్నప్పటి నుంచే క్రీడల్లో పాల్గొంటే వారికి శరీర ధారుఢ్యంతో పాటు సమాజంలో ఎదురయ్యే అవరోధాలను ఎదుర్కొనే మానసిక స్థయిర్యం కలుగుతుంది. అయితే అందుకు భిన్నంగా ప్రస్తుతం కార్పొరేట్, ప్రభుత్వ విద్యాసంస్థలు వ్యవహరి స్తున్నాయి. మైదానంలో ఆడుకోవలసిన సమయంలో చేతులకు అరదండాలు వేసినట్లు స్కూలు బల్లలపై కూర్చొబెట్టి పాఠ్యాం శాలు బట్టీ పట్టిస్తున్నారు. విద్యావ్యవస్థలో రూపొందించిన కరిక్యులంలో విద్యార్థులకు తప్పనిసరిగా వారంలో రెండు రోజులు వ్యాయామ తరగతులు ఉండాలని, పాఠశాలల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, టెన్నిస్ వంటి క్రీడలు నిర్వహించాలని ఉంది. మైదానంలో విద్యార్థులు కొంతసమయం గడిపేందుకు అవకాశం కల్పించాలి. అయితే ప్రస్తుతం ఇలాంటి విధానాలు ఎక్కడా అమలు కావడం లేదు. కేవలం మార్కులపై మాత్రమే వారిని దృష్టి కేంద్రీకరించాలని విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వత్తిడి తీసుకు వస్తున్నారు. దీనితో వీరిలో మానసిక ఎదుగుదల లేకుండాపోతోంది. కష్టాలు వచ్చినప్పుడు ఎదుర్కొనే ధైర్యం లేక ఆత్మహత్యలు చేసుకోవడం గాని తీవ్రమైన నేరాలకు పాల్పడటం కాని చేస్తున్నారు. కాలం గడుస్తున్న కొద్దీ క్రీడామైదానాలు లేకుండా పోతున్నాయి. ప్రధాన నగరాల్లో ప్రైవేటు విద్యాసంస్థల్లో కనీసం ప్రేయర్ జరిపే స్థలం కూడా ఉండటం లేదు. అపార్ట్‌మెంట్‌లలో విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారు. ఇంటి దగ్గర నుంచి ఆటోల్లోనో. బస్సులోనో పాఠశాలకు రావడం మళ్లీ ఒక్క అడుగు వేయాల్సి న అవసరం లేకుండా తిరిగి ఇళ్లకు చేరుకోవడం జరుగుతోంది. దీనితో కనీస వ్యాయామం విద్యార్థులకు ఉండటం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో కొంత వరకు క్రీడల నిర్వహణ ఆశాజనకంగా ఉండేది. ప్రస్తుతం ప్రాథమిక స్థాయి వరకు అసలు డ్రిల్ టీచర్ నియామకాలే ఉండటం లేదు. ఇక ఉన్నత పాఠశాలల్లో కొన్ని విద్యాసంస్థల్లో మాత్రమే పిఇటీ పోస్టులు ఉన్నాయి. 60 శాతం పాఠశాలల్లో పిఇటి పోస్టులు భర్తీ చేయడం లేదు. 2018లో క్రీడల అంశం సుప్రీంకోర్టులో చర్చకు దారితీసింది. విద్యార్థులకు క్రీడలను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని సర్వోత్తమ న్యాయస్థానం వ్యాఖ్యానించింది. జాతీయ వ్యాయామ విద్య వినోద ప్రణాళిక ను సుమారు రెండు దశాబ్దాల క్రితం రూపొందించారు. అయితే అది ఎక్కడా అమలు అవుతున్న దాఖలాలు లేవు. 2019లో ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో వ్యాయామం, క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థులు అంటే కేవలం పుస్తకాలతో కుస్తీ పట్టడం కాదు, వారి సంపూర్ణ మానసిక ఎదుగుదలకు మార్గదర్శకంగా ఉండాలన్న ఆశయం పక్క దారి పట్టింది. నూతనంగా తయారుచేస్తున్న జాతీయ పాఠ్యప్రణాళికలో తప్పనిసరిగా క్రీడలకు భాగస్వామ్యం కల్పించాలి. రోజుకు కనీసం గంట సమయమైనా క్రీడల ద్వారా వ్యాయామం కల్పించాల్సి న అవసరం ఉంది. గతంలో గురుకులాల్లో విద్యను అభ్యసించే వారు. అదేవిధంగా గుర్రపు స్వారీ, విలువిద్య, మల్ల యుద్ధం, కత్తిసాము, పరుగు పందా లు వంటివి ఉండేవి. క్రమంగా పాఠశాలల ప్రభావం పెరిగిన తరువాత డ్రిల్, హైజంప్, లాంగ్‌జంప్, ఖోఖో, కబడ్డీ, ఫుట్ బాల్ వంటివి క్రమం తప్పకుండా నిర్వహించే వారు. పాఠశా లలో విద్య బోధన తరువాత క్రీడలు ఉండేవి. పాఠశాలలో చదువు, ఇంట్లో చదువు తప్ప మరే అంశం వారికి పరిశీలనలో లేకుండా చేస్తున్నారు. దీనివల్ల క్రమంగా సమాజానికి జరుగు తున్న నష్టం అపారంగా ఉంటోంది. విద్యాసంస్థల నుంచి బయటకు వచ్చే విద్యార్థుల్లో అధిక శాతం మంది నేరస్తులు గానో, ఉన్మాదులుగానో, మానసిక స్థయిర్యం లేని బలహీనులు గానో ఉంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు క్రీడలపై దృష్టి సారిస్తే గుండెనిబ్బరం కలగిన యువతను సమాజానికి ఇవ్వడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో వారి సత్తా చూపించే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

ఈ ప్రపంచంలో మానవ జాతి సృష్టి ఎప్పుడు, ఎన్నివేల, లక్షల సంవత్సరాల క్రింద ఎక్కడ ఈ భూమిపై ఏ ప్రదేశంలో జరిగిందనే దానిపై భిన్నాభిప్రాయాలుండ వచ్చు. అయితే మానవ జాతి సృష్టించబడిన తర్వాత దాని మనుగడ మాత్రం భిన్నప్రాంతాలలో విభిన్న రకాలుగా కొనసాగుతున్న వైనం బహిరంగ రహస్యమే.



# తెగిపోతున్న 'తీగ'లు!

కవర్ స్టోరీ

డాక్టర్ నీలం సంపత్

ఈ నేపథ్యంలో భారతీయ, వారసత్వం, సంస్కృతి మూలాలలోకి వెళ్లి చూసినప్పుడు వేదకాలపు సంస్కృతిలో భాగంగా తొలివేదమైన ఋగ్వేదంలో స్పష్టంగా విశదీకరించ బడిన మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథిదేవోభవ అనే సూక్తిలో నిర్వచనానికి అతీతమైన దైవమనే పదాన్ని ముందుగా తల్లికీ, తర్వాత తండ్రికీ తదనంతరమే గురువులకూ, సమాజానికి అన్వయించిన వైనాన్ని పరిశీలించినప్పుడు ఆదర్శ సమాజ నిర్మాణం, ఓ ఆదర్శ కుటుంబ నిర్మాణంతోనే ప్రారంభమౌతుందనీ, ఆ ఆదర్శకుటుంబ నిర్మాణానికి ఊపిరులూదాల్సిన బాధ్యత నిస్సందేహంగా తల్లిదండ్రులదేననే సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. నిజానికి ఈ బాధ్యతను నిర్వర్తించేక్రమంలో గర్భధారణ నిర్ధారణ జరిగిన మరుక్షణం నుండీ సుఖప్రసవం జరిగేవరకు కొనసాగే తొమ్మిది నెలలకాలంలో తల్లిగర్భంలోని ఆ గర్భస్థశిశువుల రక్షణ ప్రతి కుటుంబం తమ ఆరోప్రాణంగా భావిస్తోంది. ప్రతి ఇంట్లో ఓ మహాయజ్ఞంగా సాగే సదరు ప్రక్రియగా సురక్షితంగా, విజయవంతంగా పూర్తి చేయడానికి అవసరమైన సకల చర్యలను వారివారి ఆర్థిక శక్తిననుసరించి కుటుంబ సభ్యులు త్రికరణశుద్ధితో నిర్వర్తిస్తున్న వైనం తెలిసినదే గదా.

## నైతిక విలువల శిక్షణాకేంద్రాలుగా ఉమ్మడి కుటుంబాలు

ఆధునిక నాగరికత వెల్లివిరిసే వరకు సమాజంలో కుటుంబాలన్నీ ఉమ్మడి కుటుంబాలుగా కొనసాగేవి. ఆయా కుటుంబాల్లో చిన్నారులకు ఉగ్గుపాలతోనే అత్యున్నత మానవీయ విలువలను, వెలకట్టలేని మానవీయ సంబంధాలను, నేటి ఆధారిత సమాజంలో మానవ జాతి మనుగడ కోసం వాటిని పెంచి పోషించాల్సిన అవసరాన్ని, మనుషులు మంచి మనుషులుగా ఎదగడానికి అవసరమైన నైతిక విలువలతో కూడిన జీవన నైపుణ్యాలను పెంచి పోషించే శిక్షణాకేంద్రాలుగా వ్యవహరించేవి. నిష్కల్మషమైన తల్లిదండ్రుల ప్రేమకు తోడుగా నానమ్మలు, అమ్మమ్మలు ఉగ్గుపాలతోనే చందమామ రావే జాబిల్లి రావే..లాంటి జోల పాటల లాలనతో పాటు, తాతలు, పెద్దనాన్నలు, చిన్నాన్నల పోషణలో అల్లారు ముద్దుగా పెరిగేవారు. భారత మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి.నరసింహారావు ప్రాథమిక విద్యాభ్యాసం నర్సంపేట తాలూకాలోని లకినేపల్లిలో వున్న వారి అమ్మమ్మ ఇంట్లోనే కొనసాగడం. అత్యంత ప్రేమానురాగాలతో పి.వి.గారిని వారి అమ్మమ్మ కుటుంబం ఆదరించి అక్కున చేర్చుకొని విద్యాభ్యాసం చేసే అవకాశాన్ని కలిగించడం ఆరోజుల్లో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పటిష్టస్థితికి ఓ బలమైన దృష్టాంతంగా భావించక తప్పదు. ఓనమాలు దిద్దిన మరుక్షణం నుండే మంచీచెడుల గురించీ, చెడుపై మంచి సాధించిన అద్భుత విజయాల గురించీ, పురాణాలు, ఇతిహాసాలలోని గొప్పగొప్ప వ్యక్తుల జీవితచరిత్రలతోపాటు చందమామ, బొమ్మరిల్లు, బాలమిత్ర లాంటి కథల పుస్తకాలలో కథానాయకులు, నాయికలూ వారు సాధించిన అద్భుత విజయాల గురించి వివరిస్తూ పిల్లలను ఆదర్శవంతమైన జీవితాలవైపు ఆకర్షింపబడేలా చొరవ తీసుకునేవారు.



సంఖ్యాపరంగా కుటుంబంలో పిల్లల సంఖ్య ఎక్కువగా వున్న వారిలో కోరికల సంఖ్య చాలా తక్కువగానే వుండేది.



అయితే ఉమ్మడి కుటుంబ సభ్యులు వారి కోరికలను సులభంగానే తీర్చగలిగేవారు. కాని ఇప్పుడు కాలం మారింది. ఉమ్మడి కుటుంబం చిన్నాభిన్నమైంది. కుటుంబ సభ్యులసంఖ్యా పరిమితమైంది. అయినప్పటికీ ఆర్థిక వనరుల కొరత, ఆకాశమే హద్దుగా పెరుగుతున్న ధరల నేపథ్యంలో పరిమితసంఖ్యలో వున్నప్పటికీ పిల్లల గెంతెమ్మ కోరికలను తీర్చడం తల్లిదండ్రులకు దాదాపు అసాధ్యంగా మారుతోంది.

**ప్రభుత్వబడుల్లోనే ప్రామాణిక విద్యాబోధన!**

ఓ అరవై, డెబ్భై ఏళ్లక్రితం మెజారిటీ ప్రజలు వారి పిల్లలకు కుటుంబాలకు, కాలనీలకు చేరువగా వున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్ విద్యాభ్యాసం చేయించేవారు. ప్రభుత్వ నియమాల ప్రకారం సదరు ప్రభుత్వ విద్యాసంస్థల్లో అర్హత, అనుభవం గల ఉపాధ్యాయులే విద్యాబోధన చేసేవారు. కాబట్టి ఆ తరం పిల్లలకు ఎంతో నాణ్యమైన విద్య లభ్యమయ్యేది. సెమి రెసిడెన్షియల్ విధానంలో కొనసాగుతున్న పాఠశాలల నుండి సాయంత్రం వారి పిల్లలు ఇంటికి వచ్చిన తర్వాత వారు సేదదీరి అల్పాహారాన్ని భుజించిన తర్వాత తల్లిదండ్రులు తమ ఇంటి వసారాలో తమ పిల్లల చేత హోమ్‌వర్క్ చేయించే బాధ్యతను తప్పనిసరిగా నిర్వర్తించేవారు. ఇక రాత్రి నిద్రపుచ్చే సమయంలో పాఠ్యపుస్తకాలలోని నీతికథలపై చిన్నారుల సందేహాల్ని తీర్చేవారు. ఇలా ప్రతి తల్లిదండ్రీ రోజు వారీ జీవితంలో వీలైనంత ఎక్కువకాలం తమ పిల్లలతో కాలం గడుపుతూ వారికి సరైన మార్గదర్శనం చేయడానికి ప్రయత్నం చేసేవారు. ఫలితంగా బాల్యం, శైశవ దశ నుండి యవ్వనం వైపు ఎదిగే తమ పిల్లల ప్రవర్తనను అడుగడుగునా పరిశీలిస్తూ, పర్యవేక్షిస్తూ ఎప్పుడైనా, ఎక్కడైనా తప్పటడుగు వేసే ప్రమాదం వాటిల్లినప్పుడు సరైన సమయంలో సరిచేసే ప్రయత్నం చేసేవారు. వారితో పాటు ఉమ్మడి కుటుంబసభ్యుల నీడలో కుటుంబంలోని పిల్లలంతా మంచి యువతీ, యువకులుగా మంచిపౌరులుగా రూపొందేవారు. మరోవైపు ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యాభ్యాసాన్ని కొనసాగించిన విద్యార్థులే ఎనలేని నైపుణ్యాలతో అత్యున్నత విద్యాప్రమాణాలతో గొప్ప విద్యావంతులుగా మారడంతోపాటు వారి అర్హతలకు సరితూగే ఉద్యోగాలను సైతం పొందగలిగేవారు. ఈ తంతు అంతా ఇప్పుడో గతించిన చరిత్రలో మరిచిపోయిన భాగంగా మారిందని చెప్పకతప్పదు.

## రెసిడెన్షియల్ బడుల్లోనే బాల్యం బందీగా మారుతోందా?

సెమీ రెసిడెన్షియల్ విద్యాబోధన మెజారిటీ ప్రజలకు అందుబాటులో లేకపోవడం.

సమకాలీన సమాజంలో మంచి విలువలతో కూడిన విద్యతోనే ఆదర్శసమాజ నిర్మాణం జరుగుతుందనే ఋజువైన సత్యం ప్రాతిపదికన విద్య ప్రాధాన్యత రోజురోజూ పెరుగుతున్న నేపథ్యంలో సమాజంలో ప్రతి తల్లిదండ్రీ తమ పిల్లలకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలని కలలు కనడమే కాకుండా వాటిని



నిజం చేసుకోవడానికి కఠోరంగా శ్రమిస్తున్నారు. అయితే ఆకాశాన్ని అంటుతున్న ధరల్లో, అరకొర జీతాలతో అనునిత్యం బతుకుపోరాటం చేస్తున్న తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తే గాని కుటుంబం నడవని పరిస్థితి. ఉదయం ఆరుగంటలలోపే నిద్ర లేచి ఇంటి పనీ, వంటపనీ పూర్తి చేసుకుని టిఫిన్ బాక్స్‌తో ఆఫీస్‌కు వెళ్లడానికి సిద్ధపడే తల్లిదండ్రులకు సెమి రెసిడెన్షియల్ విద్యావిధానంలో తమ పిల్లలకు విద్యాబోధన సౌకర్యాలను కల్పించే వెసులుబాటు లేదు. ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నత నేపథ్యంలో నానమ్మలు, తాతలు ఉద్యోగం, సద్యోగం లేని పెద్దనాన్నలో, పెద్దమ్మలో చిన్నాన్నలో, చిన్నమ్మలో కుటుంబంలో పిల్లల విద్యావ్యాసంగాని పర్యవేక్షించే పరిస్థితులే లేవు. ఈ నేపథ్యంలో అన్ని తరగతులకు చెందిన తల్లిదండ్రులు అనివార్యంగా తమ పిల్లలను రెసిడెన్షియల్ విద్యవైపు మళ్లిస్తున్నారు. బాగా డబ్బున్న వాళ్లు లక్షల రూపాయల ఫీజులతో తమ పిల్లలను కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పిస్తే, మధ్య తరగతులకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్‌ను కాంక్షిస్తూ అవసరమైతే తమ ఆస్తులను తెగనమ్మి కార్పొరేట్ పాఠశాలలో లేదా మోస్తరు ఫీజులతో బడ్జెట్ స్కూళ్లలో నైనా చేర్పించే ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం. ఇక మిగిలింది అట్టడుగు, బడుగు బలహీన వర్గాలకు చెందిన తల్లిదండ్రులే.

కాగా వారు కూడా తప్పనిసరి పరిస్థితులలో తమ పిల్లలను ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో, సంక్షేమ వసతి గృహాలలో చేర్పిస్తుండడం తెలిసినదే. ఈ నేపథ్యంలో మెజారిటీ తల్లిదండ్రులు తమ పిల్లలపై వున్న గంపెడు ప్రేమను చంపుకుంటూ అనివార్యంగా పాఠశాల విద్యకోసం తమంతట తామే తమ పిల్లలకు దూరంగా వుండాల్సిన దురదృష్టకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. దాని ఫలితంగా బాల్యంలో, శైశవదశలో తమ పిల్లల్లో వచ్చే శారీరక, మానసిక మార్పులను ఎప్పటికప్పుడు పరిశీలించి, సరిచేసే అమూల్యమైన అవకాశాన్ని దూరం చేసుకోక తప్పడం లేదు. ఫలితంగా పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాల్సిన తరగతి గదులూ, హాస్టళ్ల మానసిక ఒత్తిళ్లతో పిల్లల జీవితాలను అంధకారం చేస్తున్నాయనే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది.



## ర్యాంకుల వేటలో పిట్టల్లా రాలిపోతున్న విద్యార్థులు?

నేటి సమాజంలో రెసిడెన్షియల్ విద్యావ్యవస్థ పనితీరుని గమనించినప్పుడు ఈ దేశానికి వెన్నెముకగా రూపాంతరం చెందాల్సిన విద్యార్థినీ, విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యంపై ఏ సంస్థాఫోకస్ పెట్టడం లేదు. మత్తు చాక్లెట్ల పంపిణీ కూడా పాఠశాల్లో జరుగుతుందనే ఆరోపణలతో తల్లిదండ్రులు బేజారౌతున్నారు. నిజానికి పక్కావ్యాపార కేంద్రాలుగా మారిన మెజారిటీ విద్యాసంస్థల్లో విద్యార్థుల మానసిక, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించే క్రీడా ప్రాంగణాలు, వసతులు, వినోద సదుపాయాలు లేవు. మెజారిటీ విద్యాసంస్థల్లో చదువులు తప్ప వేరే వ్యాపకమే లేదు. ఈ క్రమంలో ఉదయం ఏ ఐదుగంటలకో ప్రారంభమయ్యే వారి స్టడీ షెడ్యూల్ రాత్రి పదిగంటల వరకూ కొనసాగుతుంది. పరీక్షలపై పరీక్షలు, విద్యార్థుల మధ్యతీవ్రమైన పోటీలో గెలిచేవారు వారు కొందరైతే ఓడే వారు అనేకమంది. పరీక్ష ఫలితాలకు సంబంధించి ఓవైపు వారి సబ్జెక్ట్ టీచర్లు, మరోవైపు విద్యాసంస్థల యాజమాన్యాలతో పాటు తల్లిదండ్రుల ఒత్తిళ్ల నేపథ్యంలో నిరాశ, నిస్పృహలతో పదులసంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. లక్షల రూపాయల ఫీజులతో మంచి చదువులను తమ పిల్లలకు అందించాలని ఆశించిన తల్లిదండ్రులకు కన్నబిడ్డలను కోల్పోయిన కడుపుకోతే మిగులుతోంది. నిజానికి విద్యాసంస్థల్లో ఇలాంటి అమానవీయ సంఘటనలు జరిగినప్పుడు సమగ్రన్యాయ విచారణ జరిపి పిల్లల ఆత్మహత్యలకు కారకులౌతున్న వ్యక్తులనూ, వ్యవస్థనూ కఠినంగా శిక్షించాలి. కాని దీనికి భిన్నంగా ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తుల ఒత్తిళ్లకు లోనై తూతూ మంత్రంగా విచారణ జరిపి నేరస్తులను తప్పించే ప్రయత్నాలు చేస్తున్నారంటూ తల్లిదండ్రులతోపాటు, విపక్షపార్టీలు, పత్రికలూ, ప్రసార సాధనాలూ సైతం ఎలుగెత్తుండడం గమనార్హం. అయినప్పటికీ ఇలాంటి సంఘటనలు పునరావృతమౌతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు ఆధునిక యువతపట్ల



కేన్సర్‌గా పరిణమిస్తున్న హెరాయిన్, కొకైన్, గంజాయిలాంటి మత్తుపదార్థాలను మెడికల్, ఇంజినీరింగ్, ఇతర వృత్తివిద్యా సంస్థల్లో విద్యార్థులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు తల్లిదండ్రుల్లో భయాందోళనలను కలిగిస్తున్నాయి. ఇక విద్యాప్రమాణాలు, నైపుణ్యాల పెంపుదల విషయానికొచ్చినప్పుడు మెడికల్, ఇంజినీరింగ్, వ్యవసాయ, కామర్స్, బ్యాంకింగ్, మార్కెటింగ్‌లాంటి వృత్తివిద్యాకోర్సులను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యను పూర్తిగా వారిలో అరవై, డెబ్బైశాతం మంది విద్యార్థులు విద్యాప్రమణాలు, నైపుణ్యాలు కొరవడి సరైన ఉద్యోగాన్ని సంపాదించుకోవడంలో వైఫల్యం చెందుతుండడం శోచనీయం. అత్యున్నత విద్యాప్రమాణాలు, నైపుణ్యాలలేమి నేపథ్యంలో నూటనలభై కోట్ల జనాభా కలిగిన మనదేశంలో అరవైకోట్లపై చిలుకు యువతీ, యువకుల మనదేశానికి ఆస్తిగా కాకుండా అప్పుగా మారుతుండడం విషాదకరం.

## దూరాన్ని పెంచుతున్న డాలర్ల వేట!

తమ తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితులను అనుసరించి కొంతమంది తల్లిదండ్రులు ఇంటర్మీడియట్ విద్య పూర్తయిన తర్వాత తమ పిల్లలను అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపడం జరుగుతుంది. మరికొంతమంది తల్లిదండ్రులు ఆస్తులను అమ్ముకొనైనా, లేదా అప్పులు చేసైనా సరే తమ పిల్లల అండర్ గ్రాడ్యుయేషన్ విద్యను దేశంలోనే పూర్తి చేయించి పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్య కోసం అమెరికా, ఇంగ్లండ్, కెనడా, జర్మనీ, రష్యా లాంటి దేశాలకు పంపడం గర్వంగా భావిస్తున్నారు. ఐతే సదరు విదేశాలకు సంబంధించిన విదేశీ విద్యార్థులకు విద్యాభాస్యం పూర్తయిన తర్వాత ఉద్యోగాలను కల్పించే ప్రభుత్వ విధానాలననుసరించి కొంతమందికి ఉద్యోగాలు లభ్యమై రెండు చేతులా సంపాదిస్తూ ఆయా దేశాల శాశ్వత పౌరసత్వంతో అక్కడే స్థిరపడుతున్నారు. మరికొంత మంది విదేశాలలో సరైన ఉద్యోగం లభించక ఉపాధి కోసం మన దేశానికి తిరిగి వచ్చి ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ లాంటి మహా నగరాల్లో ఉద్యోగాలను చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఐతే పై రెండు సందర్భాల్లోనూ యుక్త వయస్సుకొచ్చిన యువతీ యువకుల్లో మెజారిటీ స్వతంత్ర దృక్పథం పేరుతో తమ తల్లిదండ్రుల మాటని పెడచెవిన పెట్టి ప్రేమ వివాహాలకు పూనుకుంటూ తల్లిదండ్రులకు మానసిక క్షోభను కలిగిసుండడం బాధాకరం.

మరోవైపు మారుతున్న కాలమాన పరిస్థితులను బట్టి తమ పిల్లలు తీసుకుంటున్న నిర్ణయాలను అంగీకరించక తల్లిదండ్రుల్లో కొంతమంది వారి ఆత్మహత్యలకు కారకులైతే జీవన్మరణ పోరాటం చేయాల్సి వస్తుండడం గుండెల్ని పిండేస్తోంది. లక్షల రూపాయల జీతభత్యాలతో కోట్లకు పడగెత్తుతున్నవారు సైతం వృత్తి పరమైన ఒత్తిళ్లతో కుటుంబ పరంగా ఆశించిన ప్రేమానురాగాలు

లభ్యంకాక ఒంటరితనంతో కుంగిపోతున్నారు. ఇటీవల సిలికాన్ సిటీ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన బెంగళూరు మహానగరంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తాత్కాలిక ప్రాతిపదికన ఆటోడ్రైవర్‌గా మారి తాను అదనపు డబ్బుల కోసం కాకుండా కేవలం మానసిక ఒత్తిడి నుండి బయటపడడానికి ఈ పని చేస్తున్నానని చెప్పడం గమనార్హం. ఉన్నత చదువులతో గొప్ప ఉద్యోగాలు చేస్తున్న పిల్లల్లో కొంతమంది దూరాభారాన్ని సైతం తోసిరాజంటూ వృద్ధాప్యంలో తమ తల్లిదండ్రులను తమ దగ్గరే వుంచుకుంటూ అవసరమైన సేవలను అందిస్తూ తమ కన్నతల్లిదండ్రుల పట్ల పిల్లలుగా తమ బాధ్యతను నిర్వర్తిస్తున్న వైనం ఆనందం కలిగిస్తోంది. మరికొంత మంది పిల్లలు దూరాభారం నేపథ్యంలో తల్లిదండ్రులను తమ దగ్గరే వుంచుకోవడం వీలుకాక ఓల్డ్‌ఏజ్ హోమ్స్‌లలో వుంచుతున్నా వైనం హృదయాలను ద్రవింపజేస్తోంది.



కారణాలేవైనా ఒక రకంగా తల్లిదండ్రులు పాఠశాల విద్య కోసం తమ పిల్లలను బాల్యంలో తమ ప్రేమానురాగాలకు దూరంగా వుంచిన దానికి ప్రతిచర్యగా సదరు తల్లిదండ్రులు తమ జీవన అవసాన దశలో తమ పిల్లల ఆప్యాయత, అనురాగాలకు దూరమౌతున్నారేమోనని తాత్విక భావన సర్వత్రా వెల్లువెత్తుతోంది.

## సాంకేతిక పరిజ్ఞానమే సామాజిక విధ్వంసానికి కారణమౌతోందా?

ఆధునిక యుగంలో పలకా బలపాలకు కాలం చెల్లిపోయింది. వినోదం కోసం తోలుబొమ్మలాటలకూ, వీధి నాటకాలకూ ఆస్కారమే లేని రోజులివి. సినిమాల కోసం థియేటర్ల వరకూ వెళ్లాల్సిన అవసరమే లేదు. సాంకేతికతలో కృత్రిమ మేధస్సు వినియోగం విరివిగా పెరిగిన నేపథ్యంలో నూట నలభై కోట్లపై చిలుకు భారతీయుల్లో తొంభై కోట్ల మంది ఆండ్రాయిడ్ ఫోన్లను ఉపయోగిస్తున్న వైనం బహిరంగ రహస్యమే. మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లూ, కంప్యూటర్లూ, ల్యాప్‌టాప్‌లూ ఊహించని రీతిలో



జనజీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయనే సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. నిజానికి తొలినాళ్లల్లో అధిక పెట్టుబడి నేపథ్యంలో దేశంలో పిడికెడు మంది ధనవంతుల స్టేటస్ సింబల్‌గా వారి హస్త భూషణాలుగా కొనసాగిన మొబైల్ ఫోన్లు కాలగమనంలో ధీరూబాయ్ అంబానీకర్‌లో దునియా ముట్టీ మే జియో ఆఫర్ తర్వాత ఈరోజు అవే సెల్‌ఫోన్లు జీవితావసరాలుగా మారిన వైనం దిగ్భ్రాంతిని కలిగిస్తోంది.

సంపన్న వర్గాల నుండి సామాన్యుల వరకు ప్రతి ఇంటా సెల్‌ఫోన్ల సందడి అంతా ఇంతా కాదు. తల్లిదండ్రులు పిల్లలకు ఉగ్గుపాలనందించే క్రమంలో చందమామ రావే జాబిల్లి రావేకి స్వస్తి చెప్పి మొబైల్ ఫోన్ల తోడ్పాటుతో వారికి ఉగ్గుపాలను అందిస్తోన్న నేపథ్యంలో మొబైల్ ఫోన్ల వినియోగానికి పిల్లలు బాల్యం నుండే అడిక్ట్ అవడానికి వారి తల్లిదండ్రులే కారణంగా మారుతున్నారు. కరోనా కాలంలో విద్యాసంస్థల్లో అనివార్యంగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ క్లాసులు, జూమ్ మీటింగ్‌ల నేపథ్యంలో సెల్‌ఫోన్ల వాడకం ఊహకందని స్థాయికి ఎదిగిన మాట వాస్తవం. కాగా ఫైవ్ జి వేగంతో ఇంటర్‌నెట్ సౌకర్యంతో సెల్‌ఫోన్ల వినియోగదారులను వరదలా ముంచెత్తుతున్న సమాచారంలో ఏది మంచిదో, ఏది చెడో తెలియక మెజారిటీ ఇంటర్నెట్ వినియోగదారులు చెడు సమాచారం ఊబిలో చిక్కుకుని విలవిల్లాడుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.

## ఇంటిల్లిపాదినీ ఏకాకులను చేస్తున్న సెల్‌ఫోన్లు!?

ఆధునిక సమాజంలో ఇంట్లో ప్రతి కుటుంబ సభ్యుడికో మొబైల్ ఫోన్ అత్యవసర వస్తువుగా మారింది. తమ కుటుంబ బాగోగులు గురించి భార్యాభర్తలు రోజూ ఓ గంటో రెండు గంటలో ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకునే సందర్భాలు సైతం అరుదుగా మారుతున్నాయి. మొబైల్ ఫోన్ల కోసం మారాం చేస్తూ తల్లిదండ్రులు కొనివ్వకపోతే పిల్లలు ఆత్మహత్యలకు పూనుకుంటున్న వైనం ఒకవైపు, మరికొన్ని సందర్భాల్లో సదరు సెల్‌ఫోన్ల కోసం పిల్లలే తల్లిదండ్రులను హత్య చేస్తున్న వైనంతో మానవ సంబంధాలు మంట గలుపుతున్నాయి.

## తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు

విదేశీవిద్య, ఉపాధి పెరిగిపోవడంతో పిల్లలు తమ తల్లిదండ్రుల ఆలనాపాలనను పట్టించుకోవడం లేదు. కొందరు పిల్లలు తమ తల్లిదండ్రుల అవసానదశలో వారిని వృద్ధాశ్రమాల్లో ఉంచుతూ, ఆశ్రమ ఫీజులను చెల్లిస్తున్నారు. డబ్బుతో వారికి అన్ని సౌకర్యాలను సమకూరుస్తున్నాం అనుకుంటున్నారే తప్ప తమ అనురాగం, ఆప్యాయతలు దగ్గర ఉండి అందించాలనే ఆలోచన రావడం లేదు. టైమ్‌కు తిన్నావా, బీపీ, షుగర్ మందులను వేసుకున్నావా? అని అడిగే ఆత్మీయులు లేక తల్లిదండ్రులు నిరాశనిర్వేదంలో జీవిస్తున్నారు. పక్కన ఉండి ఆదరించాల్సిన పిల్లలు దూరప్రాంతాల్లో వారివారి వృత్తుల్లో నిమగ్నమైపోతున్నారు. ఇక ఇద్దరుముగ్గురు కొడుకులు వుంటే తల్లిదండ్రులను రెండుమూడునెలలకు ఒక్కొక్కరి చొప్పున వంతులు వేసుకుని, మరీ వారిని చూసుకుంటున్నారు.

(మిగతా 15వ పేజీలో)





# అందాల మనాలీ

హిమాలయాల్లో పీర్‌పంజల్ అనే సాధువు పర్వతశ్రేణుల్లో తపస్సు చేసాడని ఇతిహాసాలు చెబుతున్నాయి. హిమాచల్‌ప్రదేశ్ మనాలీప్రాంతం కులు జిల్లాలో ఉన్న పీర్‌పంజల్ పర్వతశ్రేణుల్లో భృగులేక్ ఉంది. మనాలీ నుంచి 12 కి.మీ దూరంలో కొండమీద ఉన్న భృగు సరస్సుకు పర్వతారోహకులు తరచూ వెళ్తారు. మొత్తం నాలుగు రోజుల టాస్క్ ఇది.

సంవత్సరంలో కేవలం 4 నెలలు అక్కడికి వెళ్లేందుకు ప్రకృతి సహకరిస్తుంది. జూన్ మధ్య నుంచి అక్టోబర్ మధ్యవరకూ పర్వతారోహకులు ఈ కొండ ఎక్కుతారు. దీనికి కొన్ని సంస్థలు ఉత్సాహవంతులకు ఫీజు తీసుకుని సహకరిస్తారు. ఐదు కిలోమీటర్ల నడక ప్రాక్టీస్ చేసి 45 నిమిషాల్లో చేరిన వీడియోలు వీరికి పంపాలి. వైద్యులతో ఫిట్ నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలి. నేను, నా స్నేహితుడు కలిసి హైదారాబాద్ నుంచి మనాలి వచ్చాం. మనాలీ నుంచి ఏబస్ క్యాంప్ గులాబా వద్దకు క్యాబ్‌లో మిమ్మల్ని పర్వతారోహణ సంస్థ వారు తీసుకువచ్చారు. అక్కడి నుంచి భృగు లేక్ సముద్రమట్టానికి 8000 అడుగులు ఎత్తులో ఉంది.

పర్వతారోహణకు కావలసిన బాంబర్ జాకెట్, రెయిన్ జాకెట్, ట్రెక్కింగ్ షూ, ట్రెక్కింగ్ పోల్స్, హెడ్‌ల్యాంప్, క్విక్ డ్రైఫాంటు, షర్ట్ కలెక్ట్ చేసుకున్నాం. ముందు జాగ్రత్తగా వోఆర్ఎస్, మందులు, ఒలినీ స్ప్రే తదితరాలు మా బ్యాగుల్లో ఉంచాం. హై ఆల్టిట్యూడ్ సిక్‌నెస్ రాకుండా డైమాక్స్ టాబ్లెట్ కూడా తీసుకున్నాం. మా బృందంలో 25మంది ఉన్నారు. ఎనిమిదేళ్ల గౌరి నుంచి 57ఏళ్ల ఆయుర్వేద వైద్యుడు వరకూ ఉన్నారు. మొదటి రోజు రెండు కిలోమీటర్ల నడక. మాతో పాటు ఇద్దరు గైడ్స్, ట్రెక్కింగ్ లీడర్ ఉంటారు. పోలా, మూలా, జోలా అనేలా ఎవరి వేగంతో వారు నడవడం, గైడ్స్ మా ముందు, వెనుక ఉంటూ సహకారం అందించారు. మధ్యలో అన్యారోగ్యం వస్తే నీకాప్స్, స్ప్రేలను ఉపయోగించి గమ్యానికి చేర్చుతారు. మా కంటే ముందు వంటవారు గుర్రాల మీద సామానుతో చేరి టెంట్ వేసుకుని వంటి ఏర్పాటు చేస్తారు. నడక మధ్యలో నీరు తాగుతూ ఉప్పు శనగలు, ఎండు ఖర్జూరాలు తింటూ ట్రెక్కింగ్ చేస్తే అనారోగ్యం రాదని వారు చెప్పారు. మొదటిరోజు 'జాంకర్ తాచ్' ప్రదేశానికి చేరాం. అక్కడ మేమే టెంట్లు వేసుకుని విశ్రాంతి తీసుకున్నాం.

> మనాలీ పేరు వినగానే మంచుకొండలు గుర్తుకువస్తాయి. ఆ కొండల్లో భృగులేక్ కొండ ట్రెక్కింగ్ పర్వతారోహకులకు ఛాలెంజింగ్ టాస్క్. భృగు మహర్షి సప్తరుషుల్లో ఒకరు. భగవద్గీతలో కూడా భృగుమహర్షి ప్రస్తావన ఉంది.

**చెరువు సాయి పవన్‌కుమార్**

మా నడక కేవలం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సాగుతుంది. మధ్యాహ్నం 3 గంటల తరువాత ట్రెక్కింగ్ సురక్షితం కాదు.

జూన్ నెల కావడంలో పగటికాలం ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 7.30లో వరకూ ఉంటుంది. రాత్రి టెంట్‌లో పడుకునేందుకు స్లీపింగ్ బాగ్స్ ఇస్తారు. రెండోరోజు ఉదయం



8గంటలకు టెంట్లు పీక్కుని నడక ప్రయాణం కొనసాగింది. మంచినీరు, వంటకు సెలయేర్లలోని నీరు వాడుకున్నారు. అవి స్వచ్ఛంగా ఉన్నాయి. రెండోరోజు ఐదుకిలోమీటర్ల నడక సాగింది. మధ్యలో పెద్ద సెలేర్లు, పర్వతాలు దాటాం. 'రోలాకోలీ' చేరి ఆరోజు విశ్రాంతి తీసుకున్నాం. అక్కడ మాకు మంచుకొండలు ఎదురుగా కనిపించాయి. మూడోరోజు టెంట్లు అలాగే ఉంచి నడక సాగించాం. రెండు కిలో మీటర్ల దూరం రాళ్లు రప్పలు, సెల యేర్లు దాటుకుని వెళ్లాం. చివరి మూడుకిలో మీటర్ల దూరం మంచుతో కప్పబడి నడక చాలాకష్టంతో భృగు సరస్సు సురక్షితంగా చేరాం. సరస్సు ఎంతటి శీతాకాలమైనా నీరు కనిపిస్తుంది. పవిత్రమైన ఆ సరస్సు దగ్గరకు పాదరక్షలు లేకుండా వెళ్లాలి. అక్కడ మేమందరం కొద్దిసేపు ధ్యానం చేసాం. ఫొటోలు దిగాం. సుమారు గంట సేపు అక్కడ గడిపి తిరిగి రోలాకోలీకి తిరుగు ప్రయాణమైనాం. భృగు సరస్సు వద్ద ఉండే అవకాశం లేదు. చలి ఎక్కువగా ఉంటుంది. రోలాకోలీకి



ఐదుకిలో మీటర్లు కిందకు దిగాం. మొత్తం మూడోరోజు 10కి.మీ నడిచాం. రోలాకోలీలో ఉన్న టెంట్లలో ఆరోజు విశ్రాంతి తీసుకున్నాం. నాలుగోరోజు ఉదయం ఉపాహారం అనంతరం టెంట్లు పీక్కుని కింద బేస్‌క్యాంప్ గులాబాకు చేరాం. ఇది హిమాలయాలలోని పీర్‌పంజాబ్ పర్వతశ్రేణుల్లోంటే ఎదురుగా దౌలాదార్ కొండలు ఉన్నాయి. ఈ రెండింటి మధ్య మనాలీలోయ ఉంది. ఆ సుందర దృశ్యం మనకు భృగు సరస్సు ప్రాంతం నుంచి కనిపిస్తుంది. మంచు కొండ కింద ఓక్ చెట్ల ప్రసిద్ధి. వాటి ఆకులు కిందభాగంలో వెండి రంగులోనూ, పైన బంగారు రంగులో సూర్యరశ్మికి మెరుస్తాయి. ఇక్కడికి వెళ్లే వారికి ఎకో బ్యాగ్‌లను ఇస్తారు. ముఖ్యంగా ఆ ప్రదేశం పరిశుభ్రంగా ఉంచాలని ఇండయా హైక్స్ సంస్థ ఇప్పటి వరకూ లక్షమూడువేల చెత్తను కలెక్ట్ చేసింది. ఏదిఏమైనా పర్వతారోహకులకు భృగు సరస్సు కొండ ఎక్కడ అటు ట్రెక్కింగ్ ఇటు పవిత్రం ప్రదేశం చూసిన తృప్తి కలుగుతుంది. ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఆత్మవిశ్వాసం ఉంటే వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా ట్రెక్కింగ్ చేయవచ్చు. ❑

(4వ పేజీ తరువాయి)

## స్త్రీలకు కించపరిచే పాఠ్యాంశాలు

అడిగితే 'పాఠ్యాంశాలపై దేశంలో నియంత్రణ లేదని, ఒక్కో ప్రాంతంలో ఒక్కోభాషలో విషయాలు ఒక్కోరకంగా ఉన్నాయని ఒప్పుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బయి ఏళ్లయిపోయినా బాలబాలికలకు చెప్పాల్సిన పాఠ్యాంశాలపై నిర్దుష్టమైన ప్రణాళిక లేకపోవడం ఘోరం! ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంశాలు, వక్రీకరణలు మారుతూ ఉండడం మరో ఘోరం. మధ్యభారతంలోని ఛత్తీస్‌ఘడ్‌లో హైస్కూలు విద్యార్థుల పాఠ్యగ్రంథంలో 'దేశంలో నిరుద్యోగ సమస్యకు మూలకారణం-మహిళలు' అని ఉంది. మహిళలు అన్నిరంగాల్లో విజృంభించడం వల్ల, అన్ని రకాల ఉద్యోగాల్లో చేరుతూ ఉండడం వల్ల పోటీ ఎక్కువైంది. అభ్యర్థుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతూ వచ్చింది. ఫలితంగానే నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది అని ప్రభుత్వం వారు నిర్ధారించారు. స్త్రీ, పురుషులందరూ దేశపౌరులయినప్పుడు పౌరులకు సమాన హక్కులున్నప్పుడు అందుకు తగినవిధంగా ప్రభుత్వాలు పని చేయాలి. ఉద్యోగవకాశాలు కల్పించాలి. అంతేగాని, మహిళలు చదువుకుని ఉద్యోగాలకు పోటీపడడం వల్ల నిరుద్యోగ సమస్య పెరిగిందనడం అసంబద్ధంగా ఉంది. స్త్రీలవల్లే ఉద్యోగాలు లేకుండా పోయాయని, మాంసాహారులంతా నీతిమాలిన వారని చెపుతూ ఏ సమాజాన్ని నిర్మించాలని ప్రభుత్వం కలలు కంటోంది? జనాభాలో సగభాగమైన మహిళల్ని హీనంగా చూపిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని రూపొందించగలరా? పాఠశాల స్థాయి నుండే పిల్లలకు అసత్యాలను నూరిపోస్తే పర్యవసానం



ఎలా ఉంటుంది? ఎలాగైనా సరే మళ్లీ మనువాదాన్ని నిలబెట్టే ప్రయత్నం భవిష్యత్తుఅంతా అంధకారమే కదా? తల్లిదండ్రులు, ఉపాధ్యాయులూ నిజాలు గ్రహించి, పిల్లలకు వాస్తవాలు చెప్పాలి. వారికి హేతుబద్ధంగా ఆలోచించడం నేర్పాలి. ❑

### కార్టూన్లకు ఆహ్వానం

కార్టూని స్టుల నుండి ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించే కార్టూ న్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంప గోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com



# ఈవారం కవిత్వం

## కమతం

**కమతం** కనుమరుగైపోయింది
కాల ప్రవాహంలో
ఎటో, ఏ పడమటి గాల్లోనో కొట్టుకుపోయింది
ప్రతి పుటా జీర్ణమైపోయిన పాత కథా పుస్తకంలా
మిగిలిపోయింది./ జమ్మిచెట్టూ
చెట్టు కింద పశువులూ/ గడ్డివామీ
మట్టిబుంగలూ, కోళ్లూ, పెంపుడు కుక్కలూ
కాసేపు నడుం వాల్చే నులక మంచమూ,
పైరగాల్లో పరవసించే
పచ్చ పచ్చని పొలాలూ, పిట్టలూ
కనుబొమల మధ్య/ చారడంత కుంకుమ సూర్యుణ్ణి
దిద్దుకున్న/ అమ్మమ్మలూ, నాయనమ్మలూ
బుట్టెడు బుట్టెడు/ పూలూ కూరగాయలూ
పందిరి కింద పలుపు తాళ్లేస్తూ
ఆ పనికీ ఈ పనికీ
మనవళ్లనీ, మనవరాళ్లనీ పురమాయించే
పెత్తాతలు
మురిపెంగా
మందలింపులు
వెన్నెల రేయిలో/
కన్నంటేదాక చెప్పిన కతలూ
ఎన్ననీ..
అదునులో
అరకలై, ఆదమరవని చాకిరై
ఏ పనికైనా ఎంతటి పనైనా
మనిషిని మించిపోతుందా! అని
చిటికెలో/ లొంగగొట్టే బలమూ బలగమూ.
కమతం కనుమరుగైపోయింది
ఆ దారిలో/ వస్తూ పోతూ చూస్తున్నప్పుడు
ఒకనాటి ఆ పనిమంతుల
ముఖాలూ/ ప్రేమ పలకరింపులూ
పచ్చి మిరపకాయలు తినే పందేలూ
కళ్లకి కనబడుతున్నట్టే
చెవికి వినబడుతున్నట్టే ఉంటుంది
ఊపిరిపోయిన ఉమ్మడి కుటుంబాలూ,
ఆనాటి అచ్చమైన, అందమైన దృశ్య పరంపరలూ
అన్నీ–
మారిన లోకంలో మాసిపోయిన గత చరిత్రగా మిగిలిపోయింది.
పెద్దదో కొద్దిదో/ అప్పటి ఏ కమతమైనా
అన్నం పండించిందిశ్రీ అన్నం పెట్టింది.

– రవి నన్నపనేని

---

## పరిరక్షించండి..

**అన్నీ** గమనిస్తూనే ఉన్నా
అంధ మనస్తత్వంతో
మనుషుల మధ్య నిర్మిస్తూ వున్న
సంకుచితత్వం/ అజ్ఞానపు అడ్డుగోడలు
చూస్తూనే ఉన్నా/ మతిహీనపు చేష్టలు
కాలం చెల్లిన భావజాలంతో
మతోన్మాదం సృష్టిస్తూ వున్న
మధ్యయుగాలనాటి/ మారణహోమాలకి
కన్నీటి వెతలకు/ కారణమైన
కర్కశత్వపు మతోన్మాదం
మళ్లీ విద్వేషాల్ని విషంగా
యువ రక్తంలోకి నింపుతూ
మానవ లోకాన్ని
చీకటి
యుగాల్లోకి
నెట్టాలని
చూస్తూ వున్న

పసిగట్టలేని న్యాయవ్యవస్థ
నిస్సహాయతతో/ ప్రభుత్వ ఉదాసీనతను
మౌన ప్రేక్షకుడిలా వీక్షించడాన్ని
గమనిస్తూనే ఉన్నా.
ప్రభూ.. అంతిమంగా
నా ప్రార్థన
పాలకులు
తమ పన్నాగాలను నిలిపి
రాజ్యాంగ విలువలను
సెక్యులర్ పవిత్రతని
పరిరక్షించేలా చూడు తండ్రీ!

– డా।। సమ్మన్న ఈటల



## అందరూ మలిచి చెప్పిన అనుభవాలు



మాలాకుమార్ (కమల పరచ) తమ వైవాహిక జీవితంలో మిలటరీ ఆఫీసర్ అయిన మేజర్ ప్రభాత్‌కుమార్‌తో దేశం అంతటా పర్యటించారు. ప్రతీ చిన్నవిషయాన్ని కూడా గమనిస్తూ తమ అనుభవాల పేటికలో భద్రపరచుకున్నారు. వాటిని కథలుగా మార్చి అంతర్జాల పత్రికల్లో, వెబ్‌సిరీస్‌లలో సమూహములోని ఇతర సభ్యులతో పంచుకుంటున్నారు. అప్పుడప్పుడు పలు పత్రికలకు పంపుతూ బహుమతులను గెలుచుకుంటున్నారు. మాలాకుమార్ 'నీజతగా నేనుండాలి' కథామాలికలో 53 కథలున్నాయి. ఇవన్నీ అనుభవాల్లోంచి సృష్టించినవి కనుక అతిసహజంగా ఉన్నాయి. ప్రతికథలోనూ ఏదో ఓ ఉదాత్తమైన సందేశం ఇవ్వాలన్న తపన వల్ల హృద్యంగా ఉండటమే కాకుండా, పాఠకులు చక్కని నీతిని గ్రహించే అవకాశం ఉంది. బాల్యంలోనే ఒకరి భార్యగా ప్రకటించటం తప్పు అని 'నీ జతగా నేనుండాలి' కథ చెబుతుంది.

నలుపు తెలుపులు రంగులు దేహానికేగాని హృదయానికి కాదు అన్న నీతి 'మట్టిలో మాణిక్యం' కథ చెబుతుంది. యథారాజా తథా ప్రజ అన్నట్లు తలిదండ్రుల అలవాట్ల యెడల అప్రమత్తంగా ఉండాలని 'చాందిని' కథ చెబుతుంది. మాలాకుమార్ కథన కదనం బావుంది.

**(నీజతగా నేనుండాలి, రచన: మాలాకుమార్, వెల: రూ 175, ప్రతులకు: అన్ని బుక్‌హౌస్‌లు)**

– కూర చిదంబరం

## మోహనవల్లి మనాలీ మధుర స్మృతులు



జింకల మోహనవల్లి ఓ కాలేజి లెక్చరర్. జాతీయ సేవా సమితి (ఎన్ఎస్ఎస్) నేతృత్వంలో పది మంది విద్యార్థినీవిద్యార్థులతో కలిసి మదనపల్లి నుండి హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీ వరకు హార్సి లీ కొండల వరకు, శేషాచలం నుండి హిమాచలం వరకు సాగిన ప్రయత్నంలో ఎదురైన అనుభవాలను 'మనాలీ స్మృతులు' పేరిట మనకందిస్తున్నారు. ఒవిధంగా యిది యాత్రరచన. విజ్ఞాన యాత్ర, సాహసయాత్రగా కూడా చెప్పుకోవచ్చు. మొత్తం పదిహేను రోజులపాటు సాగిన ఈ ప్రయాణంలో ఎముకలు కొరికే చలినీ, మనాలీ ప్రాంతపు వింతవర్షాలనీ, హిమవర్షాలనీ మన అనుభవంలోకి తెస్తారు మోహనవల్లి. 'బంగారం మించి అమూల్యమైన ప్రయాణంలో/ తెలపడానికి ఎన్నెన్ని జ్ఞాపకాల సమూహాలో/ ఆ గాథలన్నింటినీ నేను విప్పి చెప్పుకోవాలి/ ఆ అద్భుతాలనందిస్తున్నానదిగో!' అంటు తన ప్రయాణంలో పాఠకులనూ భాగస్వాముల్ని చేస్తారు రచయిత్రి. ఎక్కువ సమయంలో వుంటే వచ్చే 'Snow Blindness' గురించి వివరిస్తూ 'సిస్సు' గ్రామంలోని 'Snow Point' వద్దకు మనల్ని చేరుస్తారు. జోగినీ జలపాతం, వశిష్ఠ మందిరం, షిడింబాదేవి మందిరం, ఘటోత్కచుని ఆలయం, శార్వరీ మందిరం వంటి నూతన ప్రదేశాలను సందర్శింపచేస్తారు. Emotional Intelli gence' గురించి మోహనవల్లి వివరణ ఆసక్తిదాయకంగా వుంది. 'మనాలీ స్మృతుల'ని అనుభూతించండి. **(మనాలీ స్మృతులు, రచన: మోహనవల్లి జింకల, వెల: రూ 75, ప్రతులకు: అన్ని ప్రముఖబుక్‌హౌస్‌లు)** – రమణ వెలమకన్ని

**పుస్తక సమీక్ష**

## 'జనశ్రీ' కుడికాల-మణిపూసల శతకం



జనశ్రీ కుడికాల జనార్ధన్ రచించిన సర్వలఘుమణి పూసల శతకం, కవి ప్రతిభావ్యుత్పత్తులకు తార్కాణంగా ఆకట్టుకొంటోంది. 'లోకరీతులు' పేరిట జాలువారిన ఈ ఆణిముత్యాలు ఒక వినూత్న ప్రక్రియగా ప్రతీ పద్యంలోను మకుటం మూడవపాదంలో వుండటం విశేషాంశం. సరళమైన పలుకుబడితో, సుమధుర భావాలతో రాయబడిన ఈ శతకంలోని పద్యాలు ముక్తకాలుగా సంపూర్ణత కలిగి వున్నాయి. ఈ సర్వలఘువుల రచనాకాలం ఎనిమిది రోజులు కావడం కవి ప్రతిభను వ్యక్తం చేస్తోంది. ఈ శతకంలోని పద్యాలు సామాజిక హితాన్ని ఆకాంక్షిస్తున్నాయి. భావితరాలకు ముఖ్యంగా యువతకు ప్రబోధాత్మకంగా ప్రేమతత్వం, నైతిక, నిరాడంబరత అక్షరరూపంలో కవి అందించారు. 'నిజమిది తెలుసుకొనుము' మకుటంలోనే, కవి జనార్ధన్ ఎన్నో జీవన వాస్తవాలను పద్యరూపంలో ప్రతిబింబింప చేసారు. జీవిత విలువలు, మానవజీవనం, నిత్యసత్యాలు, లోకోక్తులు, దాంపత్యం వంటి శీర్షికలుగా ఈ శతకం చిన్నచిన్న మాటలలో నిగూఢ చింతనలను వ్యక్తీకరిస్తోంది. సరళపదాలతో, సర్వలఘువులతో ప్రతిభావంతంగా రచించారు. **(నిజమిది తెలుసుకొనుము, 'జనశ్రీ' కుడికాల జనార్ధన్, వెల: రూ 100, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)**

– యర్రమిల్లి

## తెలంగాణ అసెంబ్లీలో అతివలు



రిపోర్టర్ నుండి న్యూస్ ఎడిటర్ వరకు పలు హోదాల్లో రచయిత్రి హసీన పనిచేసారు. దాదాపు 11 అధ్యాయాలుగా ఈ పుస్తకం రాసారు. భారత రాజ్యాంగం, తెలంగాణ రాష్ట్రగీతం, ఈ పుస్తకంపై పలువురి సందేశాలు, ప్రాంతీయ పార్టీలు, తెలంగాణ ఉద్యమంలో స్త్రీలు, తెలంగాణ రాష్ట్రం ఎన్నికలు, తెలంగాణ జిల్లాలు, పరిశీలన, శాసనసభ్యులు, మనోగతంలాంటి అంశాలతో ఈ పుస్తకం సాగింది. ప్రొఫెసర్ శాంతాసిన్హా, వి.తార, శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి, డా॥జయంతిరెడ్డి, గీతాగోటికురుమ చక్కటి విలువైన అభిప్రాయాలు రాసారు. 1969 ఫిబ్రవరి 28న హైదరాబాద్ నగరంలో తెలంగాణ ప్రజాసమితి ఆవిర్భావం నుండి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దాకా పలు అంశాలు ఈ పుస్తకంలో ప్రస్తావించారు. 2023 డిసెంబర్‌లో జరిగిన 3వ శాసనసభలో 10మంది మహిళలు ఎన్నికైనారు. అలాగే మహిళా పార్లమెంట్ సభ్యులు 1967 నాటి బి.రాధాబాయి ఆనందరావు కాంగ్రెస్, ఖమ్మం, 1989లో కె.కమలకుమారి, విజయకుమారి, టి.లక్ష్మీ కాంతమ్మ, రేణుకాచౌదరి, సుగుణ కుమారి (1999 ఆదిలాబాద్).. గుండు సుధారాణి మొదలైన సభ్యులుగా ఉన్నారు. **(తెలంగాణ అసెంబ్లీలో అతివలు, రచన: డా॥షేక్ హసీన, వెల: రూ 200, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)**

– తంగిరాల చక్రవర్తి

డా॥బుర్ర మధుసూదన్‌రెడ్డి

ప్రపంచ మానవాళి ముందు దేశాన్ని సగర్వంగా నిలిపే నాలుగు అంశాల్లో బాధ్యత కలిగిన విలువలు పాటించే పౌర జనాభా, నిర్దిష్ట దేశభూభాగం, నిష్పాక్షిక ప్రభుత్వపాలన, దేశసార్వభౌమాధికార సమగ్రతలు మాత్రమే ప్రధానమైనవి. దేశపౌరులుగా మనందరికీ కొన్ని బాధ్యతలు, హక్కులు ఉన్నాయి. బాధ్యతలు నిర్వహించిన పౌరులకే హక్కులు అనుభవించే అర్హత కూడా ఉంటుంది.

# 'సివిక్ సెన్స్' సన్నగిల్లుతోందా!

నేటి పౌరుల్లో హక్కులపై పోరాటాలు జరుగుతున్నాయే తప్ప బాధ్యతల గూర్చి ఎవ్వరూ కనీసం మాట్లాడ దం లేదని మనకు తెలుసు. భారత్‌లో తనదైన నాగరికత, విలువల సమాజ సమతాస్థితి అనాదిగా కొనసాగుతున్నది. నేడు దేశంలోని అన్ని విభాగాలు దినదినం సమగ్రాభివృద్ధి చెందుతున్నా యి. మౌళిక వసతులు, ప్రజారవాణా వ్యవస్థలు, పౌరసేవలు, పౌర సౌకర్యాలు, ఆధునిక హంగులు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని పథకాలు రచించి అమలు చేసినా 'పౌర భావనలు లేదా సవిక్ సెన్స్' లోపిస్తే అవి నిష్ప్రయోజనమై బూడిదలో పోసిన పన్నీరే అవుతుందని గమనించాలి. పౌర సమాజ అభివృద్ధి, శాంతి స్థాపనకు పౌరభావనలు మాత్రమూ ఊతం ఇస్తాయని మనం తెలుసుకోవాలి. ప్రతి పౌరుడికి కొన్ని నిర్ధిష్టబాధ్యతలు ఉన్నాయని మరువరాదు. వేర్పాటువాదం, ఉగ్రవాదం, విధ్వంస వాదం, అసహన భూతం లాంటివి పెరుగుతున్న నేటి పౌరసమాజంలో సివిక్‌సెన్స్ పెంచడం మాత్రమే మన ముందున్న ఏకైక మార్గమని తెలుసు కోవాలి, సన్మార్గంలో పయ





నించేలా చూసుకోవాలి. పౌర సమాజ కనీస బాధ్యలు తన వృత్తి విధులను తూచా తప్పకుండా నిర్వహిస్తూ, సమాజహిత ఆలోచనలు చేయడం, స్వచ్ఛందంగా సేవలు విస్తరించడం, నీతి- న్యాయ-నైతికతలకు పట్టం కట్టడం, నిర్దేషిత పౌర నియమ నిబంధనలు పాటించడం, పౌరుల హక్కులను గౌరవించడం, పౌర సమాజ అవగాహనకు దోహదపడడం, ప్రభుత్వ ఆస్తులను కాపాడడం పాలనకు సహకరించడం, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రదర్శించడం, దేశభక్తితో జాతీయ పతాకం/గీతాలను గౌరవించడం, సంఘవిద్రోహశక్తుల కట్టడికి పాలనకు చేయూత ఇవ్వడం లాంటి విలువలతో కూడిన విధులు దేశఖ్యాతిని ఇనుమడింప జేస్తాయి. ఏ దేశమైనా, ఎంత సంపద ఉన్నా ఆ దేశఖ్యాతి అంతర్జాతీయ యవనిపై అక్కడి పౌరసమాజ సున్నిత స్వచ్ఛంద ప్రవర్తలపై మాత్రమే ఆధారపడి ఉంటుందని గమనించాలి.

**'సివిక్ సెన్స్' కొరవడితే జరిగే అనర్థాలు:** సివిక్ సెన్స్ లేదా పౌరభావనలు సన్నగిల్లితే సమాజంలో అశాంతి, అనారోగ్యకర దుస్థితులు రాజ్యమేలు తాయి. ఇతరుల హక్కులకు భంగం కలిగించడం, సామాజిక- నైతిక ప్రవర్తనలు సన్నగిల్లడం, దేశభక్తి పలుచబడడం, పౌర నియమనిబంధనలు బేఖాతరు చేయడం, పన్నులు ఎగవేయడం, స్వార్థబుద్ధి నాటు కు పోవడం, ప్రభుత్వ ఆస్తులు విధ్వంసం చేయడం, ట్రాఫిక్ రూల్స్‌కు తూట్లు దవడం, పరమత-కుల-ప్రాంత అసహన జ్వాలలు ఎగసిపడడం, పక్షపాతం పేట్రేగిపోవడం, సాంస్కృతిక వారసత్వాలకు విలువలు ఇవ్వకపోవడం, సామాజిక కట్టు

బాట్లను చేధించడంలాంటి కారణాలతో దేశంలో శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. రోజురోజుకు అక్షరాస్యత, విద్య పెరిగినప్పటికీ పౌరుల్లో 'సివిక్‌సెన్స్' మాత్రం పెరగడం లేదని స్పష్టం అవుతున్నది.

**పౌరబాధ్యతలు నిర్వహిస్తున్నామా?**

ఇంటి వ్యర్థాలు/చెత్త చెదారాలను వీధుల్లో వేయడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, కాలుష్యానికి ఆజ్యంపోయడం, ట్రాఫిక్ రూల్స్‌ను తుంగలో తొక్కి ప్రమాదాలకు కారణం కావడం, నిరసనల సందర్భంగా ప్రజారవాణా బస్సులు/ ప్రభుత్వ కార్యాలయాలు/ ఆస్తులను నాశనం చేయడం లాంటి ప్రమాదకర సంఘటనలు తరచుగా చూస్తూ సున్నిత పౌరులు బాధపడడం జరుగుతోంది. భారత దేశవ్యాప్తంగా 2022లో 4,61,312 రోడ్డు ప్రమాదాలు నమోదు కావడంతో పాటు 1,68,491 మంది ప్రాణాలు కోల్పోవడం కూడా పౌరభావనలు సన్నగిల్లడమే కారణంగా పేర్కొనాలి. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్‌రూల్స్ పాటించి ఉన్నట్లయితే ఈ ప్రాణాలు నిలిచిపోయేవని గమనించాలి. కల్తీ, లంచగొండితనం, దోపిడీ, అవినీతి అక్రమాలు లాంటివి నిత్యం మనల్ని, మన ఆరోగ్యాలను హరిస్తున్నాయని తెలుస్తున్నది.

పౌర భావనలే సమాజాభివృద్ధికి గొడుగులు.

మన జీవన ప్రమాణాలు, సుఖసంతోషాలు పెరగడానికి సివిక్‌సెన్స్ ఉండడం మాత్రమే ఏకైక మార్గమని తెలుసుకోవలసిన సమయం ఆసన్నమైనది. పౌరుల్లో సివిక్‌సెన్స్ పెంచడం మన కనీస కర్తవ్యం. ఉన్నతవిద్యతో పౌరభావనలు నెలకొల్పబడి విలువలతో కూడిన సమాజం చిగురిస్తుంది. అనాగరిక ప్రవర్తనలను అందరు వ్యతిరేకించాలి. చట్టాలను ఉల్లంఘించే సంఘవిద్రోహుల చేతులకు బేడీలు తొడగాలి. సమాజంలోని విద్యావేత్తలు, స్వచ్ఛంద కార్యకర్తలు, పెద్దలు తమ విధిగా సివిక్‌సెన్స్‌ను ప్రచారం చేయాలి. పాటించేవిధంగా కార్యాచరణను తీసుకోవాలి.

చట్టం గీతదాటిన వారికి సత్వర శిక్షలు వేయడం, అవగాహనలను విస్తృతపరచడం, సత్ప్రౌరులను సన్మానించడం, ఆరోగ్యకర వాతావరణాన్ని నెలకొల్పడం, జాతీయ సమగ్రతను కాపాడడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడడం, రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించడం లాంటి పౌర బాధ్యతలు దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేస్తాయి. పౌర భావనలను పాఠశాల దశ నుంచే బోధించడం మన కనీస బాధ్యతగా తీసుకోవాలి. వైవిధ్యభరిత భారతంలో ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా సివిక్‌సెన్స్‌ను పెంపొందించుకుంటూ మన భారతీయ సనాతన వసుధైక కుటుంబ పౌరభావనలకు విలువనివ్వాలి. శాంతియుత సమాజస్థాపన స్వప్నాన్ని సాకారం చేసుకోవాలి. ❑

## తెగిపోతున్న 'తీగ'లు!

**(9వ పేజీ తరువాయి)**

**అసలేం చేయాల్సి వుంది?**

ఆధునిక నాగరికత వెల్లువలో కొట్టుకుపోతున్న అపురూపమైన మానవీయ విలువలతో కూడిన ఉమ్మడి కుటుంబ నిర్మాణానికి మళ్లీ తిరిగి ఊపిరులూదాలి. ప్రాచీన భారతీయులు పూర్వాశ్రమంలో పాటించిన కుటుంబ వ్యవస్థ తాలూకు ధర్మాలను త్రికరణ శుద్ధిగా పాటిస్తూ నైతిక విలువలతో, రుజువర్తనలతో ఆదర్శ కుటుంబ నిర్మాణానికి నడుం కట్టాలి. తమ పిల్లల బంగారు భవిష్యత్ కోసం అనునిత్యం కలలు కంటూ తమ జీవన సర్వస్వాన్ని త్యాగం చేస్తున్న తల్లిదండ్రులు బాల్యం నుండి శైశవ దశను దాటి యుక్తవయస్సులో ప్రవేశించేంతవరకు వీలైనంత వరకు తమ పిల్లలతో గడిపే ప్రయత్నం చేయాలి.



సాంకేతికత వెన్ను దన్నుగా తమ తమ ఇళ్లల్లో తమ పిల్లలు ఉపయోగిస్తున్న అన్ని రకాల ఎలక్ట్రానిక్‌గా గ్యాడ్జెట్ల వినియోగం తీరుపై నిరతరం నిఘా వేసి వుంచాలి. తద్వారా ఇంటర్నెట్ దుష్ప్రభావం బారినుండి తమ పిల్లలను కాపాడుకునే అవకాశాలు మెరుగుపడతాయి.

పిల్లలు సైతం తమ తల్లిదండ్రులు తమ కోసం చేస్తున్న త్యాగాలను పరిగణనలోకి తీసుకుంటూ అత్యుత్తమ క్రమశిక్షణతో తమ జీవితాలను కొనసాగిస్తూ తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలి. ఈ ఆలోచనకూ, ఆదర్శానికీ ఊతమిచ్చే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక విద్యా కమిషన్ ఏర్పాటు ద్వారా రాజ్యాంగ బద్ధంగా రాష్ట్ర ప్రజలందరికీ శాస్త్రీయమైన ఆలోచనలను ప్రోత్సహించే విద్యను ప్రభుత్వ విద్యాసంస్థల ద్వారానే అందించడానికి భాగంగా పాఠశాల స్థాయిలో రెసిడెన్షియల్ విద్యాబోధనను తగ్గిస్తూ గతంలోలాగా డే లేదా సెమి రెసిడెనియ్షయల్ విధానంలో కొనసాగితేనే సాయంత్రం నాలుగున్నర గంటల నుండి ఉదయం ఎనిమిదిన్నర గంటల వరకు పిల్లలు తల్లిదండ్రులు కుటుంబ సభ్యులతో కలిసి వుండే అవకాశాలు ఏర్పడతాయి. తద్వారా ఆదర్శ జీవనాన్ని గడపడానికి కుటుంబమే ఇరుసుగా అవసరమైన నైతిక విలువలనూ, జీవన నైపుణ్యాలను పిల్లలు నేరుగా తల్లిదండ్రుల నుండీ, కుటుంబ సభ్యుల నుండి నేర్చుకునే అవకాశాలు సృష్టించబడతాయి. అలాంటి ఆదర్శాలను అందిపుచ్చుకున్న పిల్లలే అత్యున్నత విద్యా ప్రమాణాలతో విద్యను అందిస్తోన్న విద్యా సంస్థల్లో చేరి ప్రపంచ స్థాయి పోటీలో గెలిచే నైపుణ్యాలతో అత్యున్నత ప్రతిభతో అన్ని పోటీ పరీక్షల్లో నెగ్గి తమ తల్లిదండ్రుల కలలను నిజం చేస్తూ ఈ దేశపు అత్యంత విలువైన మానవ వనరుల సంపదగా రూపాంతరం చెంది వారి కుటుంబాలకే కాదు ఈ దేశానికే గొప్ప పేరు ప్రఖ్యాతులను తీసుకొస్తారని బుద్ధిజీవుల అభిప్రాయంతో ఏకీభవించక తప్పదు. స్థూల జాతీయోత్పత్తిలో, సంపద సృష్టిలో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద దేశంగా అవతరించడానికి పరుగులు పెడుతున్న మన దేశం అత్యుత్తమ మానవ వనరుల సృష్టిలోనూ అదే స్థానాన్ని చేరుకోవాలని ఆశిద్దాం. ❑

కథ

# నీతులు మాకేనా?

ఒక ప్రముఖ గురువు ప్రవచనాలు బోధించడానికి జ్ఞానాపురానికి వచ్చాడు. ఏ ఊరుకు వెళ్లినా గురువుకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. దాంతో ప్రవచనాలు బోధించడంలో తనను మించిన జ్ఞాని ఈ భూప్రపంచంలో లేడనే గర్వం గురువు మనసులో పెరిగిపోయింది. గర్వానికి దూరంగా ఉండే జ్ఞానాపురం ప్రజలు చాలా సౌమ్యులు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ సయోధ్యగా ఉంటారు. 'కోపం మనల్ని దహించివేస్తుంది' అనే అంశంపై గురువు ఆరోజు ఉపన్యసించారు.

'మిత్రులారా! మీరు కోపాన్ని దరి చేరనీయకండి. తన కోపమే తనకు శత్రువు అన్నారు పెద్దలు. విపరీతమైన కోపం వస్తే ఏదిమంచి? ఏది చెడు అని తెలుసుకునే విచక్షణాజ్ఞానాన్ని కోల్పోతాము. కోపాన్ని వదిలేస్తే జీవితం పూలవనం అవుతుంది' అని గురువు అనర్గళంగా తన ప్రవచనాలలో చెప్పాడు.



ప్రవచనాలు ముగిసాయి. నిర్వాహకులు సత్కరించి లక్షరూపాయలు గురువుకు అందించారు. గురువుకు విపరీతమైన కోపం వచ్చింది.

'ఇదేమిటి? నేను ప్రవచనాలు బోధించేందుకు మాట్లాడుకున్నది రెండు లక్షలు కదా? లక్షరూపాయలే ఇచ్చారు. పైగా భోజనాలు సరిగాలేవు. నాకు పదిమందితో సత్కారం చేయించలేదు.' అని నిర్వాహకులపై మండిపడ్డాడు.

'అయ్యా! మాకు చందాలు ఇస్తామన్నవారు ఇవ్వలేదు. ఈసారికి ఇలా కానివ్వండి' అని నిర్వాహకులు ప్రాధేయపడ్డారు. కోపంతో ఊగిపోతున్న గురువు తన చేతిలోని లక్షరూపాయలను అవతలకు విసిరేశాడు. ఇంతలో అక్కడ పనిచేస్తున్న నిరక్షరాస్యుడైన సౌమయ్య మంచినీళ్లు తెచ్చి గురువుకు అందించాడు.

నీళ్లు తాగిన గురువు కోపం తగ్గి కొంత కుదుటపడ్డాడు.

'అయ్యా! తమరేమీ అనుకోనంటే నాదో ప్రశ్న' అన్నాడు సోమయ్య.

'అడుగు' అన్నాడు గురువు.

'అయ్యా! మీరు ప్రవచనాలలో భాగంగా చెప్పే నీతులు మాకే వర్తిస్తాయా? మీక్కూడా వర్తిస్తాయా?' అని ప్రశ్నించాడు.

'ఇదేం ప్రశ్న? నీతులు, మంచి మాటలు అందరికీ వర్తిస్తాయి. అందరూ వినాలి, పాటించాలి? అన్నాడు గురువు.

'మీరు దశాబ్దాల కాలం నుండి ప్రవచనాలు బోధిస్తూ ప్రజల్ని చైతన్యపరుస్తున్నారు. కోపాన్ని జయించాలని అనర్గళంగా మాట్లాడి ఒక గంట వ్యవధిలోపే మా నిర్వహణలో లోపాలను ఎత్తి చూపుతూ అందరిపై విపరీతంగా కోపగించుకుంటున్నారు. ఇది మీకు న్యాయామా? నేను మిమ్మల్ని గమనిస్తూనే ఉన్నాను. మీతో మాట్లాడాలనుకున్న పేదలను మీ సమీపానికి కూడా రానివ్వడం లేదు. అదే ధనవంతులైతే మీవద్దకు సునాయాసంగా వచ్చి మాట్లాడుతున్నారు. ప్రజలు ఎంతో కష్టపడి సంపాదించిన ధనాన్ని మీరు కోపంతో విసిరి అవతల పారేశారు. మీరు బోధించే ప్రవచనాలలోని నీతులను మీరు కూడా ఆచరిస్తే బాగుంటుందని మనవి' అన్నాడు సోమయ్య.

ఈ ప్రపంచంలో తానే మహాజ్ఞానినని భావించి గర్వపడే గురువు నిరక్షరాస్యుడైన సోమయ్య మాటలు విని అవాక్కయి తన తప్పును తెలుసుకుని సిగ్గుతో తలదించుకున్నాడు. ఆరోజు నుండి గురువు గర్వాన్ని, కోపాన్ని వీడి తన ప్రవచనాలతో చెప్పే నీతులను సాధ్యమైనంతవరకు పాటించే ప్రయత్నం చేశాడు.

**- షేక్ అబ్దుల్ హాకీం జాని**





## బాలగేయం

### ఆరునూరైనా

ఆరునూరైనా
ఐదుకే నిద్రలేవాలి
నూరూను ఆరైనా
అమ్మకునాన్నకు
మొక్కాలి
భువిదివి అయినా
బుద్ధిగా చదువుకోవాలి
దివిభువి అయినా
దివ్యంగా ఎదగాలి
నింగినేల అయినా
నిజమే చెప్పాలి
నేలనింగి అయినా
నీతిగానే బతకాలి
ఇత్తడి పుత్తడి అయినా
ఇష్టపడి పని చేయాలి
పుత్తడి ఇత్తడి అయినా
కష్టపడి పనిచేయాలి
ఉదయం సాయంత్రం
అయినా
ఉత్త(వట్టి)
మాటలు మానాలి
సాయంత్రం ఉదయం
అయినా
సాయం చేస్తూ
వుండాలి ఎక్కడైనా
ఎప్పుడైనా
మంచినే చేస్తూ ఉండాలి.

**– చాడా మునిశేఖర్‌రెడ్డి**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- పి.వసంత్,** నర్సాపూర్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. గుట్కా ప్రమాదమేగానీ పాన్ మసాలాతో నష్టాలేమున్నాయి?



**జవాబు: వసంత్!** పాన్ మసాలాలో వక్కపలుకులు ప్రధానంగా ఉంటాయి. వీటితో పాటు సున్నం, కాచు, యాలకులు, మరికొన్ని సుగంధ ద్రవ్యాలు ఉంటాయి. వక్క(పోక)లలో ఉండే సహజసిద్ధమైన రసాయనాలు మన శరీరంలోని కొన్ని జన్యువులకు హాని చేస్తాయి. పచ్చివక్క చాలా అరుదుగా వాడితే దంతాల చిగుళ్లను దృఢపరుస్తాయి. వేయించిన వక్కపలుకులు ఏమంత మంచివి కాదు. గుట్కా నమిలేవారు ఆ రసాన్ని వెలుపలికి ఉమ్మేస్తారు. పాన్ మసాలా తినేవారు లాలాజలంతో కలిసిపోయిన ఆ రసాన్ని లోపలికి మింగివేస్తారు. ఆ రసం శరీరం లోపలికి వెళ్లడంవల్ల నోటికే కాదు, కడుపు లోపలి ఇతర అవయవాలు కూడా దెబ్బతినే అవకాశం వుంది. పొగాకు కలవని సాదా పాన్ మసాలాతో ఏ ఇబ్బంది ఉండదని అనేకమంది అపోహ పడతారు. పొగాకు వున్నా, లేకపోయినా పాన్ మసాలాను దీర్ఘకాలం తీసుకోవడం వల్ల కేన్సర్ లక్షణాలు వృద్ధి చెందే అవకాశం వుంది. పాన్ మసాలా గుట్కాకు పూర్తిగా భిన్నమైంది కావడంతో దీనివల్ల ఆరోగ్య సమస్యలు ఉండవచ్చని కేవలం అయోమయం మాత్రమే. గుట్కా నిషేధానికే దిక్కు మొక్కూ లేని ఈ పుణ్యభూమిలో పాన్ మసాలాకు అడ్డు చెప్పేవారెవరూ లేకపోవడం, అలవాటు పడినవారి ప్రారబ్ధమనే చెప్పుకోవాలి. ఊపిరితిత్తుల్లో, కాలేయంలో, వృషణాల్లో కణతులు పెరిగే అవకాశం బాగా వుంది.



# అమెరికాలో జీవనవిధానం

పంతంగి శ్రీనివాసరావు

**అమెరికా..ఒక అందమైన భూతల స్వర్గం. ఆ దేశంలో స్థిరపడాలని, జీవితంలో అనేక మధురిమలు అనుభవించాలని లక్షలాది మంది కలలు కంటుంటారు. అందుకు కారణం 'డాలర్'కు బలం కావొచ్చు. అనేక దేశాల్లో కరెన్సీ పతనం అవుతున్నా, డాలర్‌కు ఉన్న విలువ తగ్గకపోవడం వలన అనేకమంది ఆ దేశానికి ఆకర్షితులు కావడం సహజమే! అమెరికాలో 'గన్‌కల్చర్' వెర్రితలలు వేస్తున్నా, బతుకుకు భద్రత లేకపోయినా, అమెరికా పట్ల ఆకర్షణ ఇసుమంత కూడా తగ్గడం లేదు.**

జీవితాన్ని అనేక విధాలుగా, అక్కడి ప్రజలు వారాంతంలో వినోదవలరిలో తేలియాడుతూ ఆనందం పొందుతున్నారు అనే దానికి ఒక ఉదాహరణ. అక్కడి పర్యాటక ప్రాంతాల్లో మితిమీరిన జనం తాకిడి. అన్నిదేశాల ప్రజలు అమెరికాలో తమకంటూ ఓ లోకాన్ని సృష్టించుకుంటున్నారు. వారి ఆచార వ్యవహారాలు, స్వదేశానికి ధీటుగా అమెరికాలో నిర్వహించుకుంటున్నారు.



## ప్రమాదకరమైన ఆహార వ్యవహారాలు

పైన పేర్కొన్నవి నాణేనికి ఒకవైపు..అయితే, ఆహార వ్యవహారాలలో అతిభయంకర వాస్తవాలను వారు గమనించలేకపోతున్నారు. ఒకవేళ, కొందరికి నిజాలు తెలిసినా, అమెరికాలో లభ్యమయ్యే ఆహారానికి అలవాటు పడకతప్పడం లేదు. ఇతర దేశాల పిల్లలు కొంతక్రమశిక్షణతో పెరుగుతున్నా, అమెరికా దేశ యువత చిరుప్రాయంలోనే అనేక వ్యసనాలకు పాల్పడుతోంది. డ్రగ్స్‌కు ఎడిక్ట్ కావడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం వారు తమ జీవితంలో ఒక భాగంగా చేసుకున్నారు.

## ఆటిజం, జైగాటిజం తదితర సమస్యలు

అమెరికాలో వాడబడుతున్న ఆహార పదార్థాలు అక్కడి పిల్లలలో బుద్ధిమాంద్యం (ఆటిజం)కు దారితీస్తున్నాయి. చిన్న పిల్లలు కూడా క్రూరంగా (జైగాటిజం) ప్రవర్తించడం చేస్తున్నారు. అత్యధిక శాతం మందిని ఊబకాయ (ఒబేసిటీ) సమస్య పీడిస్తోంది. తొమ్మిది వత్సరాలకు ఆడపిల్లలు రజస్వల (ప్రికోసియస్ ప్యూబర్టీ) కావడం, మగపిల్లలకు పసివయస్సులోనే గెడ్డాలు, మీసాలు రావడం జరుగుతోంది. పాతికేళ్లకే రకరకాల కేన్సరు వ్యాధులు, ఆటోఇమ్యూన్ డిసీజెస్ బారిన పడుతున్నారు. అమెరికాలో వైద్యం చాలా ఖరీదు అయినా, సామాన్యంగా ప్రతి ఒక్క పౌరుడికి విధిగా మెడికల్ ఇన్సురెన్స్ ఉండటం వలన చికిత్స పొందుగలుగుతున్నారు.

## భిన్నమైన జీవనవిధానాలు

అమెరికాపౌరుల జీవనవిధానాలు అతిభిన్నంగా ఉంటాయి. వారు తినడంలో, నిద్రించడంలో వేళలు పాటించరు. ఎందుకంటే, వారిలో నియమిత జీవనవిధానం ఉండదు. వివిధ రకాల మాల్స్‌లల్లో ప్రాసెస్ చేసినవి, ప్రాజెన్‌ఫుడ్స్, జంక్‌ఫుడ్స్, రెడ్‌మీట్‌ల వంటివి, బహుకాలం చల్లదనంలో ఉంచినవి కొనుగోలు చేయడం, వాటిని ఇళ్లల్ల మరలా నిలువ చేసి ఓవెన్‌లో వేడి చేసుకుని తినడం వంటివి సర్వసాధారణం. ఇక అమెరికన్‌లు అయితే, వారంతంలో తెగ తింటుంటారు. ఐదురోజుల సంపాదన ఆ రెండురోజుల్లోనే తిండికి, సిగరెట్లకు, తాగుడుకు, తిరుగుళ్లకు ఖర్చు పెడుతుటారు. పొదుపు చేసేది ఇతర దేశాల పౌరులు మాత్రమే!



అమెరికన్లకు రేపటిమీద ఆశ కొద్దిగా తక్కువే.

పైకి కనిపించని నిర్లిప్తత

అమెరికా పౌరులతోపాటు, ఆ దేశంలో నివాసం వుండే ఇతర దేశాల పౌరులను సైతం ఉద్యోగ టెన్షన్స్ విపరీత పని ఒత్తిడి, ఉద్యోగభద్రత మీద ఆందోళన విపరీతంగా వేధిస్తుంటాయి. అందుకే వారిలో పైకి కనిపించని నిర్లిప్తత ఆవహించి ఉంటుంది. అమెరికాలో రెడిమేడ్ వస్త్రాల అమ్మకం అనంతం. అక్కడి మోడ్రన్ డ్రెస్‌లల్లో సింథటిక్ డ్రగ్స్ వాడుతుంటారట. అమెరికా ప్రజల్లో ధైర్యం తక్కువ. ప్రతి చిన్న విషయానికి భయపడుతూ ఉంటారు. అందుకే, స్టెరాయిడ్స్ వాడటం, హైపవర్ మందులు వాడటం ఎక్కువగా జరుగుతూ ఉంటుంది.

ప్రమాకర ఫుడ్‌మాఫియా

అమెరికాలో పసిపిల్లలకు జన్మించిన నాటి ంచి విపరీతంగా టీకాలు వేయించడం కూడా ఒక రుగ్మతనే! అమెరికాలో కొద్దికాలం నుంచి 'వీగన్ల' సంఖ్య పెరుగుతోంది. వీరిలో అత్యధికశాతం ఇతర దేశాల వారే ఉంటున్నారు. దీనికి కారణం, అక్కడి 'ఫుడ్ మాఫియా' గురించి ఇప్పుడిప్పుడే అవగతం అవుతోంది. ఇక్కడ లభ్యమయే పాలు, పెరుగుల మీద అనేక రకాల పరిశోధనలు చేస్తే విస్తుగొలిపే నిజాలు బయటపడ్డాయి. వీటిని తీసుకున్న వారిలో అరుగుదల సమస్య పీడిస్తోంది. ఎందుకంటే, అమెరికాలో లభించే ఆవుపాలల్లో తగినంత నాణ్యత కొరవడుతుంది.



వీటిల్లో సహజత్వం లేకపోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. అందుకే, రుచి కూడా చాలా తేడాగా అనిపిస్తుంది. 'డైరీ ప్రొడక్టర్స్' వాడటమే ఇక్కడి వాళ్లకు అతి ప్రధానసమస్య. నిజం ఏమిటో



తెలియదు కానీ, ఇక్కడి ఆవులకు మాంసం తినిపిస్తారట! వాటి పాలను కల్చర్ చేసి మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నారు. పిల్లల్లో, పెద్దల్లో పలు రకాల సమస్యలకు ఇటువంటి ప్రొడెక్ట్‌నే కారణం కావొచ్చు! అమెరికాలోని స్టోర్స్‌లల్లో 'గ్రాస్‌ఫెడ్ కౌ మిల్క్' అని విడిగా పాల కెట్స్ దొరుకుతాయి.అ టే, గడ్డి తినే ఆవుల లు అన్నమాట. ఆవులు గడ్డి తినక మరేమైనా తింటాయా? అనే సందేహం చాలామందికి వస్తుంది. ఆవులు మరిన్ని పాలు ఇవ్వడం కోసం, బలం కోసం వాటికి హార్మోన్ ఇంజెక్షన్స్ ఇస్తారు. మాంసాన్ని ఇంకో బాగా ఎండబెట్టి, పొడిచేసి బీన్స్‌ల్లో కలిపి ఆవులకు తినిపిస్తారన్న దిగ్భ్రాంతికర చేదు నిజం బయటపడింది. ఇంకో షాకింగ్ వార్త అందులో పందిమాంసం కూడా ఉండటం. ఇదే, మన భారతదేశంలో అయితే, ఎన్ని ఆందోళనకర విప్లవాలు జరిగేవో కదా! పెరుగు బంకగా ఉండటం అందువల్లనే కావొచ్చు. ఇటువంటి ఫుడ్ మాఫియా అమెరికా ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటోంది. అయినా, తమ పిల్లలు అమెరికాకు వెళ్లపోతే, అది తమకు అవమానకరంగా తల్లిదండ్రులు భావిస్తున్నారంటే, కేవలం సంఘంలో ఒక విధమైన అంతస్తు కోసం కావొచ్చు. నాణేనికి రెండోవైపు నొక్కులు నొక్కుల రూపంలో భయంకరంగా వుంటుంది అని తెలిసినా, అగ్రదేశమంటే నానాటికీ క్రేజు పెరుగుతుందే తప్ప తరగడం లేదు.

## సేఫ్ చార్జర్

ఐఫోన్ వినియోగదారులకు ఎదురయ్యే ప్రధాన సమస్య..చా ర్జింగ్! ఫోన్‌లో చార్జింగ్ అయిపోయిందంటే..యూఎస్‌బీ టెనింగ్ కేబుల్స్ ఎక్కడో కానీ దొరకవు. ఇక ఎయిర్‌పాడ్స్ కూడా చార్జ్ చేయాలంటే..నరకమే! ఈ సమస్య నుంచి బయటపడేయడానికి 'అంబ్రేన్' సంస్థ..'ఏరోసింక్ ద్యుయో' పేరుతో సరికొత్త 'టూ ఇన్ వన్ మ్యాగసేఫ్ చార్జర్'ను రూపొందించింది. ఐఫోన్, ఎయిర్‌పాడ్ వినియోగదారులకు ఈ పరికరం ఓ వరంగా మారనున్నది.

ఈ మ్యాగ్‌సేఫ్ చార్జర్‌పై ఒకేసారి రెండు పరికరాలను చార్జ్ చేసుకునే వీలుంది. ఫోన్ కోసం 15 వాట్స్ ఔట్‌పుట్, ఎయిర్ పాడ్స్ కోసం 7.5 వాట్స్ ఔట్‌పుట్ పవర్‌ను అందిస్తుంది.

ఐఫోన్, ఎయిర్‌పాడ్స్‌ను ఎప్పుడూ ఫుల్ చార్జింగ్‌లో ఉంచుతుంది. ప్రీమియం మెటల్‌తో తయారైన ఈ చార్జర్..లైట్ వెయిట్, పోర్టబుల్ కూడా! ఇల్లు, ఆఫీస్‌తోపాటు ట్రావెలింగ్‌లోనూ వాడుకోవడానికి ఎంతో సౌకర్యంగా ఉంటుంది. మ్యాగ్‌సేఫ్ చార్జర్‌తో పాటు ఫోన్ స్టాండ్‌గానూ పనిచేస్తుంది. ఏడాది వారంటీతో వస్తున్న ఈ టూ ఇన్ చార్జర్ ధర రూ.2,999.



## అనువాదకథ

**మూలం: అమృతా ప్రీతం**

**తెలుగు అనువాదం: అమ్జద్**

# మట్టికులం

**చబ్లినాయన్ తన అరుగు మీద ఓ బండ పెట్టుకుంది. దాని మీద కూర్చొని గిన్నెలు కడుగుకునేది, కంచాలు తోముకునేది. బట్టలు కూడా ఉతుక్కునేది. కాళ్ల మడమలు కూడా ఆ బండపై రుద్దుకునేది. కూరగాయలు కోస్తున్నప్పుడు కత్తి పదునుగా లేనట్టు అనిపించినప్పుడు ఆ బండ మీద రాసి పదును పెట్టేది.**

తన అరుగు మీదున్న బండలాగే చబ్లి తన గుండెలో అవ్యక్తమైన బాధను దాచుకుంది. సంవత్సరాల తరబడి తన జీవితంలోని ఎంగిలి దినాలను తోముకోసాగింది. మైలపడ్డ శ్వాసలను శుభ్రపరచుకోసాగింది. పగుళ్ల పడ్డ ప్రేమ మడమలను బండ మీద రుద్దుకునేది. తన పెండ్లి మొండి కత్తిని బాగా రుద్ది పదును చేసుకొంటుండేది.

ఆ ఊరి జనాభిప్రాయం ప్రకారం చబ్లి రాంలీల నాటకం ఆడేవాడితో ప్రేమలో పడింది. అతడు నెలలకొద్ది ఏ సీతకో రాముడయ్యేవాడు. ఏ దమయంతికో నలగా ఉండేవాడు. లేదా ఏ కోకిలకో రసాలుగా అయ్యేవాడు. కానీ కొన్ని నిమిషాల కోసం చబ్లికి ఏమీ కాలేకపోయాడు.

ఎందుకంటే 'సీతారాం' నాటకం తర్వాత 'నల దమయంతీ' నాటకం ఆడవచ్చు. 'కోకిల రసాలు' నాటకం ఆడవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే ఏ నాటకమైనా ఆడొచ్చు, నాటకాన్ని చూడడానికొచ్చే ప్రేక్షకులకు చాలా ఆనందంగా ఉంటుంది. తమాషాగా ఉంటుంది. వాళ్లు ఓ స్త్రీ, పురుషుడి తమాషాను తిలకిస్తారు. గట్టిగా చప్పట్లు కొడతారు. ఆ తర్వాత ఆ నాటకంలోని ముఖ్య పాత్రధారులను అక్కడే నాటక స్థలంలో వదిలేసి తమ తమ ఇంటికి వచ్చేస్తారు. నాటకంలోని రెండు ముఖ్య పాత్రధారులు జీవితాంతం ఆ పాత్రలనే ధరిస్తుంటారు. చబ్లి తన పెండ్లి నాటకం ఆడడానికి తహతహలాడసాగింది. అతడు రాంలీల ఆడేవాడు. జీవితపు నాటకంలో ఓడిపోయి, సాధువు అయిపోయాడు.

చబ్లి ఎన్నాళ్లనుంచో తన సాధువు తిరిగొస్తాడని ఎదురు చూడసాగింది. కపోతాలను ఎగిరేయసాగింది (కవ్వే ఉడాన). ఆ నిరీక్షణలోనే చబ్లి జుట్టు రంగు కూడా ఎగిరిపోయింది.



ఇప్పటికీ తన సాధువు తిరిగొస్తాడన్న నమ్మకం ఉంది. ఇప్పుడు తన తలజుట్టుకు ఎర్ర గోరింటాకు రంగు పట్టించసాగింది.

ఊరిలోని పెండ్లీడొచ్చిన అమ్మాయిల చేతులకు గోరింటాకు వేసేది. ముఖ్యంగా వారి పెండ్లి నిశ్చితార్థంలో– ప్రతిరోజు తన కండ్లకు కాటుక పెట్టుకునేది. కొద్దిసేపటి తర్వాత తన కండ్ల నీటి వల్ల కాటుక తడిసిపోగా తన చీర కొంగుతో తుడుచుకునేది.

తన జీవితం ఊరిలోని అమ్మాయిలు, అబ్బాయిల పెండ్లి సంబంధాలు చూసి పెట్టేది. కానీ తన అనుభవానుసారం ప్రతి మొగజాతి కేవలం అలంకరణ, అబద్ధాల పుట్టగా గుర్తించింది. మంచి బ్రాహ్మణ కులానికి చెందిన అమ్మాయికి ఖత్రి అబ్బాయితో వివాహం జరిగితే వారికి పుట్టే సంతానం అంగవికలాంగుడిగా పుడతాడట!

కాలక్రమేణ చబ్లికి మొగజాతిపై విశ్వాసం సన్నగిల్లింది. ఆమె మనసులో నేల.. మట్టిపై విశ్వాసం ప్రగాఢంగా మారింది. వాస్తవంలో నమ్మకమైన కులం జాతి, కేవలం మట్టిజాతి.

చబ్లినాయన్ ఏ అమ్మాయికైతే ఒంటికి పసుపు రాస్తూందో, ఏ అమ్మాయికైతే నూనెతో శరీర మర్దనం చేస్తూందో ఏ అమ్మాయికైతే కేశాలు సవరిస్తూందో ఆ సమయాలలో ఇలాగే ఆలోచిస్తుండేది.

రేగడిమట్టి, ఇసుకమట్టి, కంకరమట్టి, ఎర్రమట్టి, పసుపురంగు మట్టి.. మట్టికి కూడా ఎన్ని జాతులు!

కానీ ఏ మట్టిలో పత్తి పండుతుందో అది వేరే మట్టిలో పండదు. ఏ మట్టిలో ద్రాక్ష పండ్లొస్తాయో మరేమట్టిలో రావు. నిజంగా ఈ జాతులు ఎంత నిజమైనవి.. సత్యమైనవి!!

ఏ రోజైతే ఆ ఊరిలోని ఖత్రీయులు అమ్మాయి బాలు జాట్ అబ్బాయి నందాతో ప్రేమలో గింజుకొంటున్నప్పుడు చబ్లి ఆలోచనలన్నీ పటాపంచలైపోయాయి.

ఈ మాట ఆ నోట ఈ నోట ఊరంతా పాకిపోయింది.

బాలు తండ్రి పక్క ఊరిలో తన ఖత్రీ కులానికి చెందిన అబ్బాయితో పెండ్లి సంబంధం ఖాయం చేశాడు. ఊరివాళ్ల నోరు మూతపడింది.

చబ్లినాయన్ కొన్ని నిమిషాలలో బాలు చేతులకి పెండ్లి గోరింటాకు డిజైన్ వేయడానికి వెళ్లనున్నది.

నంద పొలం చబ్లి ఇంటివెనుక వైపునే ఉన్నది. చబ్లి తన ఇంటి వెనుక వైపున్న గోడకు పేడ అలుకుతుండగా మొక్కజొన్న తోటలో నుంచి ప్రేమ జంటల గుసగుసలు వింది.

చబ్లి ఉనికిని గమనించి బాలునంద అక్కణ్నుంచి ఉడాయించేవాళ్లు. ఇలా ఎన్నో సార్లు వీళ్లిద్దరిని చూసి తనలో తనే నవ్వుకునేది. ప్రేమగువ్వలనుకునేది... ఆలోచించుకునేది..

స్వర్ణకారుడు బంగారంలో రాగితో కల్తీ చేస్తాడు. లోకం పట్టించుకోదు. అదే ఇద్దరు ప్రేమకులు తమ స్వర్ణ ప్రేమ గుండెలో ప్రేమ స్వర్ణం కలిపితే లోకం ఆకాశాన్ని తమ తలలపై పెట్టుకొంటారు. వారిద్దరికి సమాజం శత్రువైపోతోంది.

పెండ్లింటివాళ్ల దగ్గర్నుంచి రెండవసారి పిలుపు వచ్చింది.

చబ్లి ఇంట్లోంచి బయటికొచ్చి తాళం వేసింది. తన ఆలోచనలకు కూడా.

బయట చల్లగాలి వీస్తోంది. చబ్లి తన నుదుటిపై పడిన ఎర్ర రంగు కేశాలను సవరించి, తలపై కొంగు పెట్టుకుంది.

చిన్న చిన్న అమ్మాయిలు గోరింటాకు ఉన్న పళ్లెం చుట్టూరా కూర్చొని ఉన్నారు. వాళ్లందరు చబ్లి రాక కోసం ఎదురు చూడసాగారు. ఆమె వేసే గోరింటాకు ఊరిలో మరెవరికీ రాదు. అమ్మాయిలు చబ్లి వేసే గోరింటాకును ఇష్టపడతారు.

పది అడుగులు నడిచిందో లేదో మరోసారి గట్టిగా వీచిన గాలికి తన పైట జారి జుట్టు చిందర వందరగా నుదుటపై పడింది.

చబ్లి మనసులో చిన్న ఆలోచన వచ్చింది.

ఒక్క నిమిషం కోసం నంద మొహాన్ని చూడాలనుకుంది. పాపం..! అతడు ఏ అవస్థలో ఉన్నాడోననుకుంది.

ఆమె నంద పొలాల వైపు వెళ్లింది. మోటబావిలో నుంచి నీళ్లు వస్తున్నాయి. మోటర్ నడుస్తోంది. నంద అక్కడ కనిపించలేదు. కానీ అతని మిత్రుడొకడు కనిపించాడు.

అతడు మోటబావిలో నుంచి వస్తున్న శబ్దానికి అనుకూలంగా లయబద్ధంగా పాట పాడుతున్నాడు.

'హీర్ చెప్పాడు/జోగి చెప్పింది అబద్ధం/ఎవరు అలిగిన ప్రియుడిని ఒప్పిస్తాడు?/తప్పిపోయిన, మరణించిన వారిని/ఎవరు కలుపుతారు?/లోకం కేవలం ఇచ్చేది సాంత్వనం..'

చబ్లి మనసు రోదించింది. నిజంగా మరణించినవాళ్లు, వీడిపోయినవాళ్ల ఒకేలా ఉంటారు.

నంద తల దించి పొలంగట్టు చివర కూర్చొని ఉన్నాడు. అతని కండ్లలో నుంచి ప్రవహిస్తూన్న నీళ్లు కింద పడుతూ పొలంలో ప్రవహిస్తూన్న నీళ్లలో కలుస్తున్నాయి.

"ఈ నీళ్లు ఏ పొలాలకెళ్తాయో ఆ పొలాల్లోని పంటల నుంచి ఈ కన్నీళ్ల గుబాళింపు వస్తుంది" అని చబ్లి మనసులో అనుకొంది.

నంద చబ్లి నాయన్‌ను చూశాడు. మొహం మరల్చుకొన్నాడు. చబ్లి తన నుదురుపై పడిన కేశాలను తలపై సవరించింది. పైట తలపై సర్దుకుంది.

నంద దగ్గర తనతో చెప్పడానికి ఎలాంటి సమాచారంగానీ ఫిర్యాదుగానీ లేదని అర్థం అయ్యింది.

చబ్లి పెండ్లి ఇంట్లో ప్రవేశించింది. ఆమె ఆలోచించసాగింది... "మా వృత్తి కూడా వింతగానే ఉంటుంది.

ఎవరికి మంచి జరగకపోయినా మాకు వాటితో ఎలాంటి సంబంధం ఉండదు. మా ఆచార వ్యవహారాలు పూర్తి చేసి మాకొచ్చే కానుకలను తీసుకొని వెళ్లిపోవడమే!" అని ఆలోచించసాగింది.

చిన్న చిన్న అమ్మాయిలు గోరింటాకు ఉన్న పళ్లెం చుట్టూరా కూర్చొని ఉన్నారు.

వాళ్లందరు చబ్లి రాక కోసం ఎదురు చూడసాగారు. ఆమె వేసే గోరింటాకు ఊరిలో మరెవరికీ రాదు. అమ్మాయిలు చబ్లి వేసే గోరింటాకును ఇష్టపడతారు.

"నాకు ముందు... నాకు ముందు" అంటూ చబ్లి రాకతో అరవడం మొదలెట్టారు.

కానీ వారందరికీ తెలుసు...మూలన నక్కి కూర్చున్న అమ్మాయికే ముందు గోరింటాకు రాయబడుతుందనీ, ఆ తర్వాతనే ఇతరుల వంతు వస్తుందని.

"ఎలా కులుకుతూ వచ్చిందో చూడు!!" ఓ మహిళ అంది.

"అరే! ఈరోజు కాకపోతే మరెప్పుడు తన కులుకు చూపిస్తుంది?" మరో మహిళ ఎగతాళి.

"ఎప్పటి నుంచి పాపం అమ్మాయి కూర్చొని... కూర్చొని ఎండిపోతుంది. నీ అరచేతిలో గోరింటాకు కొంచమే పెట్టేది. నాగలి దున్నేది లేదుగా!"

బాలు అమ్మ, పిన్ని ఒకే ఊపిరిలో చబ్లిపై విరుచుకుపడ్డారు.

".. .. ఈరోజు నాతో నాగలియే దున్నించుకుంటే బాగుండేది" అని మనసులో అనుకుంది.

కానీ తను నోరు విప్పే ముందు బాలు మొహం వైపు చూసింది.


## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

కానీ తను నోరు విప్పేముందు బాలు మొహంవైపు చూసింది.

ఆమె నోరు కూడా తన నోరులాగే మూసుకొని ఉంది.

బాలు తల వంచుకొని కూర్చొని ఉంది. ఆమె చేతిలో చిన్న ఎండిపోయిన (గడ్డి) పరక ఉంది. దానితో తన రెండు కాళ్ల మధ్యన ఉన్న మట్టిని కి(కెల)లకసాగింది.

మృదువైన తన చెంప బుగ్గల పైనుంచి జారుగుతున్న కన్నీళ్లు కెలికబడిన ఆ మట్టిలో పడి, ఇంకిపోతున్నాయి.

చల్లి బాలు చేతిలోని గడ్డిపరకను తీసుకొని దూరంగా పారేసింది. ఆమె రెండు తెల్లని చేతులను తన చేతుల్లోకి తీసుకొని, అరచేతులను విప్పి, గోరింటాకు పట్టించసాగింది.

కొన్ని రోజుల్లోనే గోరింటాకు రంగు పేలిపోతుందని చల్లికి తెలుసు. కానీ గడ్డిపరకతో కెలికబడిన మట్టిలో ఇంకిపోయిన ఆమె కన్నీళ్ల మాత్రం ఏ రోజైనా మంటలను రేపుతాయని అనుకొంది.



దగ్గర్లో నిలబడిన మహిళలు వివాహ గీతాలు పాడసాగారు.

నాన్న నా సందు-గొందులు

ఇరికి అయిపోయినాయి

నా ముంగిలి ఇప్పుడు పరదేసమైంది!

చల్లి ఈరోజు తలపై వేసుకున్న పూల పైట తిరగబడి ఉంది. గమనించుకోలేదు.

కానీ ఇక్కడి ప్రతి విషయాన్ని కూడా మరో విధంగా అర్థం చేసుకోసాగింది. అన్నీ బోల్తా పడ్డాయన్నట్లుగా అనిపించాయి ఆమెకు.

చల్లి ఆలోచించసాగింది...

"అమ్మాయిల అదృష్టం కూడా విచిత్రంగా ఉంటుంది. తల్లిదండ్రుల ఇంటిదారి సందులు ఇరుకుగా అయిపోతాయి. అందులో నుంచి ప్రేమపరమైన మొహం కూడా దూరలేనంత ఇరుకుగా ఉంటుంది. కానీ (వరుడి) ఓ పెద్ద పెండ్లి ఊరేగింపు దాని గుండా ప్రవేశిస్తుంది.

"ఖత్రీయులకు తమ కులం ఉంటుంది. జాట్ కులానికి చెందిన అబ్బాయి ఈ విషయాన్ని ఎందుకు విస్మరించాడో?"

పెండ్లి ఊరేగింపు దగ్గరికి రాసాగింది. ఆడవాళ్ల అరుపులు, కేకలు పెద్దగా వినిపించసాగాయి.

చాలా హడావుడిగా మారింది అక్కడి వాతావరణం.

బాలు నంద ప్రేమకథను తన నోటి పండ్ల మధ్య నమలసాగింది.

"... అయితే ఖత్రీయులకు తమ జాతి సంబంధం దొరికిపోయింది" చల్లినాయన్ గట్టిగా ఓ ఊపిరి పీల్చింది. మనసులో అనుకోసాగింది. కానీ మట్టిజాతినెవరు చూడలేదు.

ఓ బంజర్ గుర్రంపై కూర్చొని నున్నని మట్టిని వివాహమాడటానికి బయలుదేరి వచ్చాడు. బంజర్‌లపై పూల కిరీటం ధరించి వచ్చాడు.

నున్నని మట్టి ఎర్ర దుస్తులేసుకొని పెండ్లి పల్లకిలో ఎక్కి కూర్చుంది.

✦




### సాలరీ డే

ఇన్‌స్పెక్టర్: లిఖితగారూ, మీ ఆయన పది రోజుల నుండి మిస్సింగ్ అని ఇప్పుడు కంప్లైంట్ ఇస్తారా?

లిఖిత: సార్! రేపు ఫస్టు కదా, సాలరీ వస్తుంది. అందుకే ఇప్పుడు కంప్లైంట్ ఇస్తున్నా.

### నీకు పెళ్లవుతోందిగా..

పండు: ఎందుకు మమ్మీ? ఇప్పుడు కరాటే, బాక్సింగ్ అంటూ ఇంత లేటుగా నేర్చుకుంటున్నావు?

తల్లి: రోజులు మారాయి కదరా.. వచ్చే నెల్లోనే నీ పెళ్లి మరి.

### ప్రశాంతత కోసం..

అనిల్: ఈరోజు నీ వంట చాలా బాగుంది.


గీత(భార్య): పిల్లలు బాగా లేదన్నారు.

నీరజ: పిల్లలకి ఏం తెలుసు చెప్పు! ఇంట్లో ప్రశాంతంగా వుండాలంటే ఇలాంటివి ఎన్నో చెప్పాలి.

### నీకు లేదుగా..

పండు: మమ్మీ, మొబైల్ ఎక్కువసేపు వాడితే మెదడు దెబ్బతింటుందని నాన్న అంటున్నారు.

తల్లి: పండూ, ఈ విషయం గురించి నువ్వు ఏమీ భయపడకు. అది వున్నవాళ్లు భయపడాలి.



### వృథా చేయొద్దని..

నాని: విజ్జూ, ఈరోజు నాలుగు మాత్రలు ఇచ్చావెందుకు? ఒకటే కదా ఇవ్వాలి.

విజ్జు: అదా.. ఈ మాత్రలు ఎక్స్‌పైరీ అవుతున్నాయి. అందుకే అన్నీ ఇచ్చాను.

**- ఈ.ఎస్.మాధవన్**

## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.**
**మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.**
**sunmagvaartha@gmail.com**




# పూలరేకుల సొగసు తెలుగు

**జయసూర్య**

**"అచ్చులే నీకెంత అందమ్ము చేకూర్చు
హల్లులే అమృతపు జల్లులిడగా
పలుకులే నిత్యము పదసేవనము నొల్లు
జాతీయముల్ కథా ఖ్యాతి బెంచు
సామెతల్ నుడికార శతక సంపద నీదు
ప్రతిభ నూరేగించు పల్లకీను
నిత్యవధానముల్ నిండు శోభను నింపు
పద్యసౌరభమెంత హృద్యతరము
వివిధ సాహిత్య పరవళ్ల విమల చరితా
జనపథముల గనిపించు జనని నీవు
కవుల మదినేలు దొరసాని గల్పవల్లి
అమ్మ తెలుగమ్మ నీకిదే అంజలించు"**

తెలంగాణ సీమలోని కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన యువకవి శ్రీ సత్యనారాయణ గళం నుంచి హైదరాబాద్ ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై పద్యకవి సమ్మేళనంలో జాలువారిన పద్య ప్రశంస యిది. పాల్కురికి సోమనాథుడు మొదలుకొని ప్రస్తుత ఆధునిక కవులు ఎందరో తెలుగు పద్యానికి వన్నె తెచ్చారు. తెలుగులో సాహిత్య ప్రక్రియలు ఎన్ని వచ్చినా సాహిత్య లోకంలో పండిత, పామరులను అలరించే తెలుగుపద్యం తెలుగు ఘనకీర్తివంతంగా ఏ భాషకు లేని విశిష్టత గర్వంగా ప్రకటించుకుంది. నాటి సభాధ్యక్షులు ఆచార్య ఫణీంద్ర 'దేశ భాషలందు తెలుగులెస్స' ఒకప్పటి మాటగా ప్రస్తావించి 'విశ్వ భాషలందు వెలుగు తెలుగు' అనే నినాదం అందించారు. తెలంగాణ మాగాణంలో పండిన, అద్భుత సాహిత్యం తెలుగు భాషా ఖ్యాతిని ఇనుమడింపచేసింది. అమ్మ ఒడే మొదటి బడిగా సరళమైన, కమ్మనైన మన అమ్మ పలుకులో జీవన పరమార్థాన్ని విప్పి చెప్పే మాతృభాష, పాల్కురికి సోమనాథుడు, బమ్మెర పోతన, అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు ఎందరో మహాకవులు అజరామరం చేసారు. తల్లి, చనుబాలను తాగిస్తూ 'జో అచ్యుతానంద జోజో ముకుందా, లాలి పరమానంద రామ గోవిందా' అని పాడినా, ఉగ్గుపాల నుంచి నాడూ నేడూ ఉద్యమాలు, తిరుగుబాట్లు, పోరాటాలు, ఏ తెలుగు ప్రాంతీయతలో చోటు చేసుకొన్నా, ఏ మాట, పాట ఆధ్యాత్మికం, అభ్యుదయం, విప్లవం ఏదైనా, ఏ ప్రక్రియ అయినా తల్లి పలుకుబడి తన్మయింపచేస్తుంది. తెలుగు తల్లికి సమర్పించే మల్లె, గుమ్మడి, తంగేడు, ముద్దబంతి ఏదైనా అన్నింటా తెలుగు ఆత్మ విరాజిల్లుతుంది. పారిజాత పరిమళాలయినా, మందార మకరంద మాధుర్యమైనా తెలుగు అక్షరానికి ప్రణతులు అర్పించవలసినదే.

రాజరికపు వ్యవస్థలోను, తదనంతర ఆంగ్లేయ పాలనలో తెలుగు, సామాన్య జనావళికి దూరం కావడం మన చారిత్రక దౌర్భాగ్యం. స్వాతంత్ర్యానంతరం కూడా సంస్కృతం, పారశీకం, ఆంగ్ల భాషలనే అధికార భాషలుగా, దేశీయ భాషల వికాసం నిరోధించబడింది. విద్యాబోధన, పాలనా వ్యవహారాలకు,




విద్యాలయాలలో, ప్రభుత్వ కార్యాలయాలలో, న్యాయస్థానాలలో అధికారయుతంగా కానీ, సామాజిక వినియోగంలో కానీ తెలుగుకు ప్రాధాన్యం అంతంత మాత్రంగా వుండటం కారణంగా తెలుగు ఆదరణకు నోచుకోలేదు. దానికితోడు ప్రపంచం చిన్నదైంది. బతుకుతెరువు వెదుక్కొంటూ సామాన్య జనావళి, సంపన్నత సుఖ సంతోషాల జీవన గమ్యాల వైపు మధ్య, సంపన్న వర్గాలు తరలిపోవడం, స్వభాష, స్వదేశీయతలు పట్టించుకోని సామాజిక పరిస్థితుల, అత్యాధునిక నాగరికత కమ్ముకొచ్చింది. పండితులు, రచయితలు, సాహితీవేత్తలు, కవులు యితర విద్యాధిక వర్గాలు కొంతవరకు మాతృభాష పట్ల మమకారం చూపించినా, దైనందిన జీవన సమరంలో నిలదొక్కుకోవడానికి కొట్టుమిట్టాడే జన సామాన్యానికి, యువతరానికి, భాష స్థితిగతులు పట్టించుకోవలసిన అవసరం, అగత్యం లేని పరిస్థితి తల ఎత్తింది.

ప్రస్తుతం మనం ఎక్కడ ఉన్నాం? అంతర్జాలంలో అమ్మభాష వన్నె, చిన్నెలు ప్రవేశించాయి. ఈ-సాహిత్యం వెల్లివిరుస్తోంది. సాంకేతికతకు పాత తరం మాట ఎలా వున్నా అందరూ మేం సైతం అంటూ ముందుకు రావలసి వస్తోంది.

డిజిటల్ రంగంలో తెలుగు వినియోగం అందుబాటులో ఉంది. బ్లాగర్లు, కీబోర్డు, ఫాంట్ల రూపకర్తలు, ఈ-సాహితీవేత్తలు మేధస్సుకు పదును పెడ్తున్నారు. వెబ్‌సైట్‌లు రూపొందాయి. ప్రభుత్వ వెబ్‌సైట్‌లను మాతృభాషలోకి మార్చే కృషి ప్రారంభమైంది.

అంతర్జాలంలో డిజిటల్ తెలుగును పలు రూపాలలో వినియోగింపచేసే సాంకేతికతకు ప్రోత్సాహం లభిస్తోంది. అంతర్జాలంలో పదిహేనేళ్ల నుంచి ఈ కృషి కొనసాగుతోంది. కానీ సాహితీరంగం తప్ప, వైజ్ఞానిక రంగంలో వినియోగానికి నిర్దిష్టమైన పలుకుబడి తయారు చేసుకోవాలి. బోధన, పరిశోధన కలిసే వైజ్ఞానిక భాష రూపొందించుకోవాలి.

ఇప్పుడు అందరి చేతికి అంతర్జాలం వచ్చింది. పుస్తకాలు యిక అందరికీ కాదు. కానీ ప్రపంచం నలుమూలలా వుండే తెలుగువాళ్లందరూ సులభంగా చదువుకొనే సాంకేతిక అవకాశం వున్నా స్థానిక భాషల వ్యాప్తి అంత వేగవంతంగా లేదు. బ్లాగింగ్ విప్లవం తర్వాత సామాజిక మాధ్యమాలలో తెలుగు వినియోగం మొదలైంది. కొత్త తరానికి మన భాషను మరింత చేరువ చేయడానికి అంతర్జాలమే శరణ్యం. అచ్చుయంత్రంతో ఆవిష్కరించబడిన అక్షర విప్లవం అంతర్జాలం వైపు దూసుకుపోతోంది.

# కరుణో.. ధర్మమో!

యామిజాల జగదీశ్

ఆయన మలయాళ రచయిత. పేరు వైకోమ్ ముహ్మద్ బషీర్. ఆయనను బేపోర్ సుల్తాన్ అని పిలుస్తారు. 1908లో జన్మించిన బషీర్ 1994లో మరణించారు. ఆయన తన జీవిత చరిత్రను రాస్తూ ఓ సంఘటన చెప్పారు...

ఓరోజు ఏదో రాస్తూ ఉన్న బషీర్‌కి ఆకలేసింది. కాగితాలూ, కలమూ పక్కన పెట్టారు. లుంగీ కట్టుకున్నారు, లాల్చీ వేసుకున్నారు. లాల్చీ జేబులో ఓ పర్సు పెట్టుకుని ఇంటికి దగ్గర్లోనే ఉన్న హోటల్‌కి వెళ్లారు. మసాలా దోసె అడిగి తెప్పించుకుని తిన్నారు. ఆయన కాలంలో మసాలాదోసె ఖరీదు రెండు రూపాయలు. చేతులు కడుక్కుని క్యాష్ కౌంటర్ దగ్గరకు వెళ్లారు. జేబులో ఉన్న పర్సు తీసి రెండు రూపాయలు ఇవ్వాలనుకున్నారు. కానీ జేబులో పర్సు లేదు. "ఇంట్లోంచి వస్తున్నప్పుడు పర్సుతోనే వచ్చానని, కానీ పర్సు పోయిందనీ, ఇంటికెళ్లి డబ్బులు పట్టుకొచ్చి ఇచ్చేస్తాను" అన్నారు బషీర్.

క్యాష్ కౌంటర్లో ఉన్నతను నవ్వి చాల్లేవోయ్ కథలు అని కర్కశంగా మాట్లాడాడు.

అతని ధోరణితో తాను తిన్న దోసెకు పిండి రుబ్బడమో, బల్లలు తుడవడమో, పాత్రలు కడగటమో వీటిలో ఏదో ఒక పని చెయ్యక తప్పదనుకున్నారు బషీర్.



అప్పటికి బషీర్ మరోసారి చెప్పడానికి ప్రయత్నించారు. ఇంటికెళ్లి రెండు రూపాయలు తీసుకొచ్చి ఇస్తానని. కానీ క్యాష్ కౌంటర్లో ఉన్న వ్యక్తి మరింత కఠినంగా మాట్లాడుతూ "లాల్చీ విప్పు" అన్నాడు.

ఆ మాటతో కంగుతిన్నారు బషీర్.

వెనక్కు తిరిగి చూసారు. కనీసం ఓ యాభై అరవై మంది తింటున్నవాళ్లు బషీర్ చొక్కా విప్పితే చూడడానికి ఉవ్విళ్లూరుతున్నారే తప్ప వారిలో ఏ ఒక్కరూ రెండు రూపాయలిచ్చి బషీర్‌ను శిక్ష నుంచి తప్పించే ఆలోచనలో లేరు. అటువంటి వారికోసమా తాను కథలు రాస్తున్నాను? అనుకున్నారు బషీర్. చేసేదేమీ లేక బషీర్ చొక్కా విప్పి అక్కడి టేబుల్‌పైన ఉంచారు.

క్యాషియర్ అక్కడితో ఆగలేదు. లుంగీ విప్పమన్నాడు. దాంతో బషీర్ తన పరువు పోబోతోందని అనుకున్నారు. తాను విప్పకుంటే క్యాషియరే లుంగీ విప్పేస్తాడేమో అనుకుని బషీర్ లుంగీ విప్పడానికి సిద్ధపడుతుంటే బయటి నుంచి ఓ మనిషి పరుగు పరుగున వచ్చి కౌంటర్లో ఉన్నతనిని "ఈ పెద్దమనిషి ఎంత ఇవ్వాల్సి ఉంది?" అని అడిగాడు.

"రెండు రూపాయలు" అన్నాడు క్యాషియర్.

వెంటనే ఆ మనిషి రెండు రూపాయలు క్యాషియర్‌కి ఇచ్చాడు.

"రావయ్యా..!" అంటూ బషీర్ భుజం మీద చెయ్యేసి బయటకు తీసుకుపోయాడు. ఓ పది పదిహేను అడుగులు వేసిన తర్వాత రోడ్డు పక్కన ఓ చెట్టు కింద నిల్చుని తన దగ్గర ఉన్న ఇరవై పర్సులు చూపిస్తూ "వీటిలో నీదుంటే తీసుకో" అన్నాడు.

నిజానికి వాటిలో బషీర్ పర్సు ఉంది. కానీ "లేదని" చెప్పారు. అక్కడి నుంచి అతను ముందుకెళ్లిపోతుంటే బషీర్ అతనిని పిలిచి ధన్యవాదాలు చెప్పాలనుకున్నారు. కానీ అతని పేరు తెలియకపోవడంతో పాటు బషీర్ గొంతు పెద్దగా అరిచి పిలవలేకపోతోంది. అతను చాలా దూరం వెళ్లిపోయాడు.

అయితే బషీర్ అంటారిలా.. "అతని పేరు కరుణో లేక ధర్మమో అయిండాలి". తన పర్సుని చాకచక్యంగా కొట్టేసిన అతని ప్రతిభను మనసులో ప్రశంసించి ముందుకు అడుగులేశారు.

## గుర్తుకొచ్చింది

ఈ మధ్య తెన్నేటి లతగారి రాసిన ఊహాగానం చదువుతుంటే ఓ విషయం గుర్తుకొచ్చింది.

అందులో ఆమె ఓ చోట ఇలా రాశారు. "... .. నేనేదో అన్నానని ఒక పబ్లిషరుకు కోపం వచ్చింది. అతను పేజీకీ అణా దగ్గర బేరం ప్రారంభించి పావలా దగ్గర ఆపేశాడు. తెల్లబోయి "ఇదేం అన్యాయమయ్యా?" అని అడిగితే "సిగరెట్‌కి, కాఫీకీ కూడా రాసేవాళ్లున్నారని" జవాబిచ్చాడు. ఆ తరువాత ఒక పత్రికలో బాధపడుతూ ఈ విషయం రాస్తే నన్ను, ఆ ఎడిటర్‌ను కూడా తిడుతూ చెరో పది పేజీల ఉత్తరం రాశాడు. చివరకు రచయితల బతుకు ఇలా తయారయిందా? అని అపరిమితమైన జాలి వేసింది".

ఈ మాటలు చదువుతుంటే నా మనసు మద్రాసు రోజులకెళ్లాయి.

అఫ్‌కోర్స్ నేనేమీ లతగారిలాగా మహా రచయిత్రిని కాను కానీ ఓ అనామక వ్యక్తి (ఇప్పటికీ ఎప్పటికీ అంతేననుకోండి)గా నాకైన అనుభవమొకటుంది. గతంలో చెప్పినట్టు గుర్తు. కానీ మరోసారి చెప్పుకోవాలనిపించింది.

నాకో మిత్రుడు ఉండేవాడు. అతని పేరు చెప్పడం లేదిక్కడ. అతనొక అమ్మాయిని ప్రేమించాడు. కానీ ఆ అమ్మాయి అతనిని ప్రేమించిందో లేదో తెలియదు. అయితే ఆ అమ్మాయిని తన వైపుకి ఎలాగైనా తిప్పుకోవడానికి ఓ ఎత్తుగడ వేశాడు. అదేంటంటే ఆ అమ్మాయి చేతిరాత దాదాపుగా నా చేతిరాతలాగే ఉండేదట. కనుక ఆ అమ్మాయి తనకు ప్రేమలేఖ రాస్తున్నట్లుగా నాతో ఉత్తరాలు రాయించుకుని పోస్ట్ చేయించుకునేవాడు. వాటిని చూపించి తనను ప్రేమించేలా చేయాలన్నది అతని ఆలోచన. మొదట్లో ఇలాంటి ఉత్తరాలు రాయనన్నాను. ఎవరికైనా తెలిస్తే లేనిపోని గొడవవుతుందని భయమేసింది. అదే మాట చెప్పాను. అయినా ఆ మిత్రుడు నాకు భరోసా ఇచ్చాడు. నా మీద ఈగ వాలనివ్వనన్నాడు. అంతేకాదు.. ఒక్కో ప్రేమలేఖ రాసిస్తే ఓ కప్పు పాలు లేదా ఓ కప్పు చాయ్ అలాగే రెండు బటర్ బిస్కెట్లు ఇప్పిస్తానన్నాడు. వాటికి ఆశపడి వాడికి ఓ అరడజన్ ఉత్తరాలు రాసిచ్చాను కూడా.

తీరా ఆ అమ్మాయి అతనిని ప్రేమించలేదు సరికదా కన్నెత్తయినా నా మిత్రుడిని చూడలేదు. దాంతో అతను మద్రాసులో ఉండలేక రాజమండ్రికి వెళ్లిపోయాడు.

కామెడీ కథ

# ట్రాఫిక్ జామ్‌లో షాపింగ్

పులగం చిన్నారాయణ

**మొత్తం మీద బుచ్చిసుందరి హైదరాబాద్ పర్యటన దిగ్విజయంగా ముగిసింది. బుచ్చి (వాళ్లాయన అలాగే పిలుస్తాడు)ది రాజమండ్రి దగ్గర్లోని కోరుకొండ గ్రామం. ఒక్కగానొక్క అన్నయ్య హైదరాబాద్‌లో భారీ ఎత్తున ఉద్యోగం చేస్తున్నాడని ఊళ్లో గొప్పగా చెప్పుకుంటుంది. అవును మరి.. ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్ ఉద్యోగమే. అయినాగానీ ఆఫీసు 12వ ఫ్లోర్‌లో వుంది కాబట్టి భారీ ఎత్తున ఉద్యోగం కిందనే లెక్క కదా!**

ప్రతి యేటా తిరునాళ్లకి తూచా తప్పకుండా వచ్చే బుల్లెబ్బాయ్ తన చెల్లిల్ని హైదరాబాద్ రమ్మని ప్రతిసారీ ఆహ్వానిస్తూనే వుంటాడు.

బుచ్చికి కూడా హైదరాబాద్ చూడాలని వుంది. గోల్కొండ కోట, చార్మినార్, ట్యాంక్‌బండ్, సాలార్‌జంగ్ మ్యూజియం, బిర్లామందిర్, కొత్త సచివాలయం, రామోజీ ఫిలింసిటీ.. ఇత్యాదివన్నీ చూసెయ్యాలని తెగ ఆరాటం. కానీ ఆ ఉమ్మడి కుటుంబానికి పెద్ద కోడలు తానే కనుక అన్ని పనులూ తానే చూసుకోవాలి. అన్నీ వదిలేసి వెళ్లడం కుదరదు.

చుట్టుపక్కల అమ్మలక్కలేమో "మేం చాలా సార్లు హైదరాబాద్ వెళ్లొచ్చాం. భలేగుంటది.." అని చెప్పడంతో బుచ్చికి మనోవ్యాధి మొదలయ్యింది.

చివరికి బుచ్చికోరిక నెరవేరింది. వారం రోజులు హైదరాబాద్ వెళ్లడానికి రంగం సిద్ధమైంది. భర్తకి ఖాళీ లేకపోవడంతో పెద్ద కొడుకుని తీసుకొని హైదరాబాద్ వచ్చేసింది.

ఆ వారం రోజులూ సెలవు పెట్టి బుల్లెబ్బాయ్ అక్కకి సిటీ అంతా చూపించేసాడు. ఆరోజు సాయంత్రం బుచ్చి తిరిగి వెళ్లిపోతుంది. ఆరు గంటలకి గచ్చిబౌలిలో బస్సు.

ఐదున్నర గంటలప్పుడు ఉన్నట్టుండి బుచ్చి కెవ్వున అరిచింది. ఇంట్లోవాళ్లంతా కంగారుగా బుచ్చి చుట్టూ మూగేసారు. "ఏమైందక్కా?" కంగారుగా అడిగాడు బుల్లెబ్బాయ్.

అందరి నోటా అదే మాటా.

"చిన్నోడు హైదరాబాద్ నుంచి నాలుగు జతల బట్టలు కొనుకురమ్మన్నాడు. అదేదో హీరో మహేశ్‌బాబు మాల్ వుందటగా. ఆ సంగతి మరిచిపోయాను. అసలు వాడు రాకాసోడు. ఏడ్చి నా ప్రాణం తీసేస్తాడు" అని మొత్తుకుంది బుచ్చి.

"అదా సంగతి, ఏం ఫర్లేదు. చక్కగా షాపింగ్ చేద్దువుగానీ" నవ్వుతూ అన్నాడు బుల్లెబ్బాయ్.

"అదెలాగండీ... టైం ఐదున్నర దాటుతోంది. అరగంటలో బస్సు బయలుదేరుతుంది" అంది బుల్లెబ్బాయ్ భార్య.

"నేనున్నాను కదా!" అని విషయం చెప్పకుండా ఫోజిచ్చాడు బుల్లెబ్బాయ్.

ఆరు గంటలకి బస్సు బయలుదేరింది. "ఇంకెక్కడ షాపింగ్" అనుకుంది బుచ్చి.



తను బైక్ మీద ఆ బస్సు వెనకే బయలుదేరాడు బుల్లెబ్బాయ్.

కొండాపూర్ చౌరస్తాకి కొద్ది దూరంలో బస్సు ఆగింది. బుల్లెబ్బాయ్ బైక్ వేరేచోట పార్క్ చేసి గబగబా బస్సెక్కి "అక్కా రా... షాపింగ్ చేద్దువుగానీ" అని దించేసాడు.

బుచ్చికి అయోమయంగా వుంది. బస్సు ఆపేసి తమ్ముడు షాపింగ్ అంటాడేంటని ఆమెకేం అర్థం కావడం లేదు.

బస్సు దిగుతూ బుల్లెబ్బాయ్ ఆ బస్సు డ్రైవర్‌కి ఏదో చెప్పాడు.

బుల్లెబ్బాయ్, బుచ్చి ఇద్దరూ నడుచుకుంటూ షాపింగ్ మాల్‌కి వెళ్లారు.

బుచ్చి కంగారుగా డ్రెస్‌లు సెలెక్ట్ చేస్తుంటే "అక్కా! కంగారేం లేదు. బస్సు మనకోసం ఇంకో గంట అయినా ఆగుతుంది" అని ధైర్యం చెప్పాడు.

దాంతో బుచ్చి విశ్వరూపం దాల్చింది. సేల్స్‌మాన్‌ని విసిగించి రెండు గంటలు కష్టపడి నాలుగు డ్రెస్‌లు సెలెక్ట్ చేసింది.

బిల్లు చెల్లించి బయటకు వచ్చేసరికి కొంచెం దూరంలో ట్రాఫిక్‌లో నత్తనడక నడుస్తున్న తమ బస్సు కనిపించింది.

అన్నకి థ్యాంక్స్ చెప్పి బస్సు ఎక్కేసింది బుచ్చి.

ఊరెళ్లాక హైదరాబాద్‌లో తను చూసిన వింతలన్నీ చెప్పడం మానేసి తమ షాపింగ్ కోసం అన్నగారు రెండు గంటలు బస్సు బస్సు ఆపడం గురించి గర్వంగా చెప్పుకొచ్చింది. బస్సు ఆపించి అలా ఎలా షాపింగ్ చేయించాడో ఆమెకు అర్థం కాలేదు. అదంతా తన అన్నగారి పరపతి అనుకుంటోంది పిచ్చి బుచ్చి.

బుల్లెబ్బాయ్‌కి హైదరాబాద్ కొట్టిన పిండి కాబట్టి కొండాపూర్‌లో ట్రాఫిక్ జామ్ ఎలా వుంటుందో రోజూ రుచి చూస్తుంటాడు కనుక ఆ అనుభవంతోనే అక్క షాపింగ్ పూర్తి చేయించాడు. ఈ సందర్భంగా ట్రాఫిక్ జామ్‌కి థ్యాంక్స్ కూడా చెప్పుకున్నాడు. ■

# యోగ్యతనెరిగి దానం

కస్తూరి మురళీకృష్ణ



అది శాస్త్ర జేతవనంలో విహరిస్తున్న కాలం. ఆ కాలంలో ఆయన శిష్యులతో సంభాషిస్తూ "పూర్వ కాలంలో పండితులు తమకు ఉపకారం చేసిన వారికి ఉపకారం చేశారు" అన్నాడు.

దాంతో అందరికీ ఆసక్తి కలిగింది. ఆ గాథ వినిపించమని పట్టు బట్టారు.

................

బోధిసత్త్వుడు వారణాసి రాజుగా పుట్టిన కాలం అది. ఆయన ధర్మ మార్గం, న్యాయ మార్గంలో పాలన చేస్తూండేవాడు. నిరంతరం దానధర్మాలు చేస్తూండటం వల్ల శీలములు రక్షణలో భద్రంగా ఉండేవి.

ఇంతలో సరిహద్దు వద్ద విద్రోహులు చెలరేగడంతో వారిని అణచేందుకు రాజు ససైన్యంగా వెళ్లాడు. కానీ విద్రోహుల చేతిలో పరాజితుడయ్యాడు. దాంతో రాజు అశ్వంపై ప్రయాణిస్తూ సరిహద్దు గ్రామం చేరాడు.

ఆ సరిహద్దు గ్రామంలో ఆ సమయంలో 30 మంది రాజసేవకులు ఉన్నారు. ఉదయమే వారు గ్రామంలో పలు రకాల పనులు చేస్తుంటారు.

ఆ సమయంలో అశ్వంపైన గ్రామంలోకి ప్రవేశించిన రాజును చూసి వారు భయభ్రాంతులయ్యారు. తమ తమ ఇళ్లల్లోకి దూరారు.

వారిలో ఒక్కడు మాత్రం ధైర్యం కూడగట్టుకుని, ఆ అశ్వంపై వున్న పురుషుడిని అడిగాడు.

"రాజు సరిహద్దుల వద్ద ఆందోళనను అణచివేయడానికి వెళ్లాడని విన్నాం. నువ్వు ఎవరివి? దొంగవా? రాజపురుషుడివా?"

"నేను రాజపురుషుడను" సమాధానం ఇచ్చాడు రాజు.

"అయితే.. నా ఇంటికి రా" అని తన ఇంటికి తీసుకువెళ్లాడు.

అతనికి సముచితం సత్కారాలు చేశాడు. భార్యతో అతని పాదాలు కడిగించి భోజనం పెట్టాడు.

"మీరు కాస్సేపు విశ్రమించండి" అన్నాడు. రాజపురుషుడు విశ్రమిస్తున్న సమయంలో గుర్రం మీద జీనను దులిపాడు. గుర్రానికి నీరు పెట్టాడు. దాని వీపు మీద తైలం రాసి మాలిష్ చేశాడు. తినటానికి గడ్డి వేశాడు.

అలా నాలుగు రోజులు ఆ వ్యక్తి రాజపురుషుడు అనుకుంటూ రాజుకు సేవలు చేశాడు.

రాజు బయలుదేరే సమయం వరకూ సేవలు చేస్తూనే ఉన్నాడు". చివరికి ఒకరోజు



బయలుదేరుతూ రాజు అతనితో అన్నాడు...

"సౌమ్యా, నా పేరు మహాశ్వారోషి. నగరం మధ్యలో మా ఇల్లు. ఎప్పుడయినా నువ్వు నగరానికి వస్తే దక్షిణ ద్వార పాలకుడితో "మహాశ్వారోహి" ఇల్లు చూపించమని అడుగు. అతనితో మా ఇంటికి రావాలి తప్పకుండా".

ఆ తరువాత రాజు వెళ్లిపోయాడు.

తమ రాజు కనబడకపోవటంతో పరాజితమైన సైన్యం నగరంలో ప్రవేశించకుండా నగరం బయటనే ఎదురు చూస్తున్నారు. వారందరితో కలిసి రాజు నగరంలో ప్రవేశించాడు. జనులంతా వెళ్లిపోయిన తరువాత దక్షిణ ద్వార పాలకుడిని పిలిచాడు. "ఎవరైనా గ్రామవాసి వచ్చి మహాశ్వారోహుడిని చూడాలని అడిగితే, నువ్వు దగ్గరుండి మరీ నా దగ్గరకు తీసుకురావాలి. నీకు బహుమానం లభిస్తుంది" అని చెప్పాడు.

ఎన్ని రోజులయినా ఆ గ్రామవాసి రాలేదు. ఎలాగయినా అతడిని రప్పించాలని రాజు గ్రామం పన్నును రెండు రెట్లు చేశాడు.

అయినా ఆ గ్రామం నుంచి ఎవ్వరూ రాలేదు. మళ్లీ పన్ను పెంచాడు. అయినా ఎవ్వరూ రాలేదు. మళ్లీ మళ్లీ పన్ను పెంచుతూ పోయాడు. అయినా ఆ గ్రామవాస్తులెవ్వరూ రాలేదు.

ఒకరోజు ఆ గ్రామంలో పెద్దలంతా సమావేశమయ్యారు. "నీ ఇంటికి అశ్వారోహి అయిన రాజపురుషుడు వచ్చి వెళ్లినప్పటి నుంచీ మన గ్రామంపై మోయలేనంతగా పన్నుల భారం పడుతున్నది. వేరే ఏ గ్రామం పన్ను కూడా పెరగటం లేదు. కేవలం మన గ్రామంపైననే పన్ను విపరీతంగా పెరుగుతోంది. కాబట్టి నువ్వు ఒకసారి వెళ్లి మహాశ్వారోహిని కలిసి, మన బాధలు చెప్పు, పన్ను తగ్గించమని అభ్యర్థించవచ్చు కదా!" అన్నాడు.

"వెళ్తాను...కానీ ఉట్టి చేతులతో ఎలా వెళ్తాను? అతని భార్యకు, ఇద్దరు పిల్లలకు బట్టలు, ఏవైనా ఆభరణాలు ఇవ్వాలి కదా! అవి సిద్ధం చేసి ఇవ్వండి. వాటిని తీసుకుని పోతాను. ఇవి ఇచ్చి పన్ను విషయం అడుగుతాను" అన్నాడు.

వారంతా అంగీకరించారు. కానుకలను సిద్ధం చేశారు.

అతని భార్య పిండివంటలు చేసి ఇచ్చింది. వాటన్నిటినీ తీసుకుని నగరం వచ్చాడు. నగరంలో దక్షిణ పాలకుడిని "మహాశ్వారోహుడు ఇల్లు ఎక్కడ?" అని అడిగాడు.

"నేను చూపిస్తాను" అని ఆ ద్వారపాలకుడు అతని చేయి పట్టుకుని రాజద్వారం దగ్గరకు తీసుకువెళ్లాడు.

ఆ వార్త తెలియగానే రాజు సింహాసనం దిగి పరుగు పరుగున ద్వారం వద్దకు వచ్చాడు. అతడు లోపలకు అడుగు పెట్టగానే రాజు అతడిని కౌగిలించుకున్నాడు. కుటుంబ సభ్యుల క్షేమ సమాచారాలు కనుక్కున్నాడు. అతన్ని ఉన్నతమైన ఆసనం మీద కూర్చోబెట్టాడు. శ్వేతపత్రం కింద కూర్చున్న అతడి కాళ్ల రాణితో కడిగించాడు. ఆమె కాళ్ల కడుగుతుంటే బంగారు కలశాలతో నీళ్లు పోశాడు రాజు. అతడి పాదాలు తుడిచి సుగంధ తైలాలు పూశాడు. "నా కోసం నువ్వేమైనా తెచ్చావా?" అనడిగాడు.

అతడు తినుబండారాలు అందించాడు. వాటిని రాజభవనంలో ఉన్నవారందరికీ పంచిపెట్టాడు, తానూ తిన్నాడు.

తాను తెచ్చిన వస్త్రాలను రాజుకు అందించాడు.

రాజు వాటిని రాణికి ఇచ్చాడు. "నాకు చేసే సపర్యలన్నీ ఇతడికి చేయాలి. సుగంధ మూలికలతో స్నానం చేయించాలి. విలువైన వస్త్రాలు కట్టించాలి. రాజాభరణాలతో అలంకరించాలి" అని ఆజ్ఞాపించాడు.

మంత్రి అలాగే అన్నీ చేయించాడు. ఆరోజు సాయంత్రం అందరినీ సమావేశపరిచాడు. అందరి సమక్షంలో అతడికి అర్ధరాజ్యం కట్టబెట్టాడు.

ఆ రోజు నుంచీ వారు కలిసే ఉన్నారు. కలిసి భోజనం చేసేవారు, కలిసి తిరిగేవారు. ఒకరిపై ఒకరికి అత్యంత విశ్వాసం ఉండేది.

అతడి భార్యా పుత్రులకు కూడా నగరంలో పెద్ద భవనం ఏర్పాటు చేశాడు.

అయితే రాజు దగ్గర ఉండే మంత్రులకు, ఇతర పెద్దలకు రాజు వ్యవహారం నచ్చలేదు.

రాకుమారుడిని పక్కకు పిలిచారు.

"రాజు ప్రవర్తన బాగాలేదు. ఒక సామాన్యుడికి అర్ధరాజ్యం ఇచ్చాడు. అతనితో కలసి భోజనం చేస్తున్నారు, కలసి నిద్రిస్తున్నారు. పెద్దా చిన్నా తేడా లేకుండా అందరితో వాడికి నమస్కారం చేయిస్తున్నాడు. వాడి వల్ల రాజు ఎలాంటి లాభం పొందాడో తెలియదు. కానీ ఇదంతా అసహ్యంగా ఉంది. రాజు ప్రవర్తనకు అందరం సిగ్గుతో ఛస్తున్నాం. ఈ ప్రవర్తన రాజుకు తగదని మీరయినా చెప్పండి" అని అభ్యర్థించారు.

"ధార్మికుడైన వాడిని మీరు కారణం లేకుండా తలకిందులుగా వేలాడదీశారు. దాని ఫలితం ఇది" అన్న సమాధానం వినిపించింది. అప్పుడు ఏడుస్తూ వారణాసి రాజు కట్లు విప్పమని ఆజ్ఞాపించాడు దర్భసేనుడు.

వారి వాదన రాకుమారుడికి సమంజసం అనిపించింది. ఓ రోజు రాజు ఏకాంతంగా ఉన్నప్పుడు మంత్రులు తనతో ప్రస్తావించిన విషయాలు రాజుతో చెప్పాడు, రాకుమారుడు.

"మీ పద్ధతి మార్చుకోండి" అన్నాడు.

రాజు కాస్సేపు మౌనంగా ఉన్నాడు. చివరికి చెప్పాడు. "నేను యుద్ధంలో ఓడిపోయిన తరువాత ఒక నాలుగు రోజులు ఎటు పోయానో నీకేమైనా తెలుసా?" అన్నాడు.

తెలియదన్నట్లుగా తల అడ్డంగా ఊపాడు రాకుమారుడు.

"నీకే కాదు. ఎవ్వరికీ తెలియదు. ఎందుకంటే ఆ సమయంలో నేను అతని ఇంట్లో ఉన్నాను. అతడు నాకు సేవలు చేశాడు. నాకు ఆరోగ్యం ఇచ్చాడు. నేను శక్తి పుంజుకుని రాజ్యానికి వచ్చేవరకు ఇతని ఇంట్లోనే ఉన్నాను. అలాంటి వాడికి నేనే ఏమిస్తే రుణం తీరుతుంది?" అన్నాడు.

రాకుమారుడు తల వంచుకున్నాడు.

"ఎవరికి యోగ్యత లేదో వారికి దానం ఇచ్చినా, యోగ్యత ఉన్నవాడికి దానం చేయాలన్నా కష్టాల పాలయినప్పుడు వాడికి ఎవరి సహాయమూ లభించదు. ఎవడయితే యోగ్యులకు సహాయం చేస్తాడో వాడికి కష్ట సమయంలో సహాయం లభిస్తుంది".

ఇది విన్న రాకుమారుడు మౌనంగా ఉండిపోయాడు.

విషయం తెలిసిన మంత్రులు కూడా ఏమీ అనలేదు.

కథ చెప్పిన తరువాత శాస్త్ర ధర్మోపదేశం చేశాడు.

"ఆ కాలంలో ఆ సరిహద్దు గ్రామంలోని వ్యక్తి ఆనందుడు. ఆ రాజును నేనే" అన్నాడు.

...............

అది శాస్త్ర జేతవనంలో విహరించే కాలం.

ఆ సమయంలో బౌద్ధులంతా జమకూడినప్పుడు మాటల నడుమ బుద్ధుడు అన్నాడు "ప్రాచీన కాలంలో పండితులు తమకు జరిగిన అనర్థం నుంచి అర్థాన్ని సాధించారు". తమకు ఆ కథ చెప్పమని అభ్యర్థించారు.

బుద్ధుడు ఆ కథ చెప్పటం ప్రారంభించాడు.

...............

పూర్వ కాలంలో వారణాసి రాజుకు ఒక మంత్రి ఉండేవాడు. అతడు రాజుకు ఎంతో సన్నిహితంగా ఉంటూ కూడా అంతఃపుర ద్రోహం చేశాడు.

రాజు శిక్షగా అతనికి దేశ బహిష్కారం విధించాడు.

దేశం వదలి వెళ్లిన మంత్రి కోసల రాజును ఆశ్రయించాడు. కోసల రాజు పేరు దర్భసేనుడు.

దర్భసేనుడికి వారణాసి రాజుపై క్రోధం తెప్పించాడా మంత్రి.

దాంతో మంత్రుల నడుమ తమ భవనంలో కూర్చున్న వారణాసి రాజును పట్టి తెప్పించాడు. అతడిని ఉత్తరం ద్వారం వద్ద తలకిందులుగా వేలాడదీయించాడు.

ఇంత జరుగుతున్నా వారణాసి రాజు దర్భసేనుడి పట్లగానీ మంత్రి పట్లగానీ క్రోధభావం ప్రదర్శించలేదు, ద్వేషం ప్రదర్శించలేదు. మైత్రీ భావాన్ని ప్రదర్శించాడు.

తలకిందులుగా వేలాడగట్టినప్పుడు యోగ మార్గంలో ధ్యానాన్ని ప్రారంభించాడు. ధ్యానంలో మునిగి సర్వం మరచిపోయాడు.

ఇంతలో వారణాసి రాజుకు కట్టిన తాళ్లు తెగిపోయాయి. ఆయన అంత పైనుంచి కింద పడలేదు. ఆకాశంలో కూర్చున్నాడు ధ్యానం చేస్తూ.

కానీ దర్భసేనుడి శరీరంపై మంటలు చెలరేగాయి.

మంటలు భరించలేక అటు ఇటు దొర్లటం ప్రారంభించాడు.

తనకీ శిక్ష ఎందుకని ఏడుస్తూ పొర్లుతూ అరిచాడు.

"ధార్మికుడైన వాడిని మీరు కారణం లేకుండా తలకిందులుగా వేలాడదీశారు. దాని ఫలితం ఇది" అన్న సమాధానం వినిపించింది.

అప్పుడు ఏడుస్తూ వారణాసి రాజు కట్లు విప్పమని ఆజ్ఞాపించాడు దర్భసేనుడు.

తీరా వెళ్లినవారికి బంధాలలో కాదు ఆకాశంలో స్వేచ్ఛగా కనిపించాడు వారణాసి రాజు.

వాళ్లు ఆ విషయం దర్భసేనుడికి చెప్పారు.

అది విని "నాకు నిష్కృతి లేదా?" అని ఏడుస్తున్న దర్భసేనుడి దగ్గరకు వారణాసి రాజు ఆకాశమార్గం వీడి వచ్చాడు.

అతడి కాళ్ల మీద పడ్డాడు దర్భసేనుడు.

"తన తప్పు క్షమించమన్నాడు"

ఒంటి మంటలు తగ్గగానే రాజ్యం వేరేవారికి అప్పగించి వెళ్లిపోయాడు.

వారణాసి రాజు కూడా తన రాజ్యాన్ని మంత్రులకు అప్పగించి, ప్రవ్రజించి బ్రహ్మలోకం వెళ్లిపోయాడు.

కథ చెప్పిన బుద్ధుడు ధర్మోపదేశం చేశాడు.

"ఆ కాలంలో దర్భసేనుడు ఆనందుడు, వారణాసి రాజును నేనే" అన్నాడు.

# మానవత్వంలోని ఏకత్వం

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

ఈ లోకంలో మంచిగా జీవించాలనుకునేవారికి అంటే పశుపతిలాగా జీవించాలనుకుంటే వారు తమ ఇంద్రియాలను నిగ్రహించుకోవడం ఎంతో అవసరం.

అలాగాక పశువుగా జీవించాలనుకుంటే ఇంద్రియ నిగ్రహం అంతగా అవసరముండదు. పశువులూ, మృగాలూ, పక్షులూ జన్మతః వచ్చిన క్రూరత్వాన్ని ఏమాత్రమూ మార్చుకోలేకపోతున్నాయి. పుట్టుకతో వచ్చిన దుర్గుణాలు పుడకలతో కాల్చేవరకూ మార్చడానికి వీలుకాదు.

సింహం క్రూర భావంతో జన్మిస్తుంది. క్రూర భావంతోనే మరణిస్తూ ఉంటుంది. పిల్లికి ఎలుకలను పట్టే స్వభావం జన్మతోనే వస్తుంది. జన్మం అంతవరకూ ఆ లక్షణం అలాగే ఉంటుంది. క్రూర స్వభావంతో జన్మించిన మృగాలను ఎలాంటి ప్రయత్నంతోనైనా సాత్విక మార్గంలోకి తేవడం ఎంతో కష్టం. కానీ మానవుని విషయంలో అలా కాదు.

క్రూర స్వభావంతో జన్మించిన మానవుడైనా సత్పురుషుల దర్శన, స్పర్శన సంభాషణం చేతనూ, ప్రచార బోధనల చేతను అతగాడు సాత్విక మార్గానికి రావడానికి ఎంతైనా అవకాశం వుంది. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. మనకు జన్మతో ప్రాప్తించిన దుర్గుణాలు, కేవలం పవిత్రులైన పెద్దల సాంగత్యంతోనూ, పవిత్రమైన సంఘం చేతనూ తొలగే అవకాశం వుంది.

రామాయణంలో ఈ విధంగా జన్మతః పవిత్ర భావాలతో, ఇంద్రియ నిగ్రహంతో వున్నవాడు లక్ష్మణుడు. అతను పుట్టినప్పటి నుండియే రామార్పితమైనాడు. లక్ష్మణుడు పుట్టిన రెండవ రోజు నుండే విపరీతంగా ఏడ్చేవాడట. కారణం ఏమిటోనని అందరూ కంగారుడిపోయారు. ఎంతో మంది వైద్యులకు చూపించారు. అనేక విధాలైన యంత్రాలు, తంత్రాలు, మంత్రాలు చేయించి చూశారు. లాభం లేకపోయింది. చివరకు రాజగురువులైన విశిష్ఠులవారి వద్దకు వెళ్లి విషయమంతా వినిపించారు. ఆయన తన దివ్య దృష్టితో పరికించి రాముని ఏడుపుకు కారణం గ్రహించారు. "రేపటి నుండి ఈ పిల్లవాడిని కౌసల్య మంచం మీదున్న రాముని వద్ద పరుండపెట్టమన్నాడు". వారు ఆ విధంగానే చేశారు. అంతే! లక్ష్మణుడు ఆ క్షణం నుండే రోదనను మాని, ఆనందంగా కాళ్లూ, చేతులూ ఆడిస్తూ హాయిగా వున్నాడు. అందరూ ఎంతో ఆశ్చర్యపోయారు.



లక్ష్మణుని రోదనకు రామ వియోగమే కారణమని తెలుసుకున్నారు. జీవితాంతం వరకూ లక్ష్మణుడు అట్టి సంయోగాన్నే కోరుకున్నాడు. ఆనాటి నుండే లక్ష్మణుడూ నీడవలె రాముని అనుసరించాడు.

రాముడు లేకుండా లక్ష్మణుడు భుజించేవాడు కాదు. ఒక్క క్షణమైనా రాముని విడిచి వుండేవాడు కాదు. ఎక్కడికి వెళ్లినా రాముని వెంట నీడలా అనుసరిస్తూ వచ్చాడు. అతనికి సర్వస్వమూ రాముడే. కైకేయి తన కుమారుడైన భరతునికి రాజ్య పట్టాభిషేకం జరగాలనీ, రాముడు నారవస్త్రాలు, జడలూ ధరించి పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం చేయాలని కోరింది. నిజానికి ఆ వరానికీ-లక్ష్మణునికి ఏమాత్రం సంబంధం లేదు. అయినా అతను రాముని వెంట తానూ నారవస్త్రాలు, జడలు ధరించి వెళ్లాడు. రాముడు ఎలాంటి వస్త్రాలు ధరించాడో అలాంటి వస్త్రాలే తానూ ధరించాడు. అలాగే ఆహార విహారాలందు కూడా. నిత్య జీవితంలో రాముని అనుసరిస్తూ వచ్చాడు. పధ్నాలుగు సంవత్సరాలు కూడా నిద్రాహారాలు మాని, సీతారాములను సేవించుకుంటూ, వారు ఎట్టి ఆపదలకూ గురి కాకుండా కాపాడుతూ వచ్చాడు.

నిజంగా ఆలోచిస్తే లక్ష్మణుడు లేకుండా సీతారాముల జీవితం వుండేదో మరి. సాక్షాత్ నారాయణ మూర్తియే రామచంద్రుడిగా అవతరించినప్పటికీ సీతారాములకే తన జీవితాన్నంతా అర్పితం గావించి, రామాజ్ఞ లేకుండా ఒక్క అడుగైనా వేసేవాడు కాదు. తాను చేసే ప్రతి కావ్యాన్ని పరోపకార్యార్థమై వినియోగించుకుంటూ వచ్చాడు. సీతారాముల సేవ నిమిత్తమై తన సంసారాన్ని కూడా త్యజించాడు. ధర్మ స్వరూపుడైన రామచంద్రమూర్తి సేవలో దృష్టిదోషం, మనో దోషమూ కూడా లేకుండా, పవిత్రమైన మార్గాన్ని, పవిత్రమైనటువంటి జీవితాన్ని గడిపాడు.

లక్ష్మణుడూ దివ్యాంశ సంభూతుడైనప్పటికీ అతనిలో అటువంటి దైవశక్తి రామునితో కూడినప్పుడు మాత్రమే ప్రకటితమవుతుండేది. ఈ విధంగా మానవులైనవారు మానవత్వంలోని ఏకత్వాన్ని నిరూపించుకుంటూ, దైవత్వాన్ని గుర్తించాలి. ఏనాడూ అహంకారం నశిస్తుందో ఆనాడే దైవ దర్శన ప్రాప్తికి మార్గం సుగమం అవుతుంది.

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458



# సంపద పెరగాలంటే?



**సౌమ్యభారతి – ఇందుకూరు**

**ప్రశ్న: గురువుగారూ, 'ధనవంతులు అవడానికి అనేకమైన తాంత్రిక మార్గాలు ఉన్నాయి' అని చాలామంది నమ్ముతూ ఉంటారు. నిజంగా అలాంటివి ఉన్నాయా? ఉంటే అందులో సులభమైన మార్గం ఏదైనా ఉందా?**

**జవాబు:** ధన ఆకర్షణ తంత్రం: డబ్బులు సంపాదించడానికి అనేక రకాల తంత్రాలు ఉంటాయి. అంటే 'హంఫట్' అనగానే డబ్బుల సంచులు ఆకాశం నుండి వచ్చి పడటం కాదు. ఒక ప్రోడక్ట్‌ను లేదా సేవలను తీసుకొచ్చి మార్కెట్లో పెట్టి అమ్మితే దాని ద్వారా వచ్చిన డబ్బులో కొంత లాభం ఆదాయంగా వస్తుంది. వ్యాపార వ్యవహారాలలో, యుద్ధంలో, రాజనీతిలో కూడా యంత్రం, తంత్రం, మంత్రం... ఇవన్నీ ఉంటాయి. మనకు తెలిసిన తంత్రాలు కొన్ని. తెలియనివి తంత్రాలు అనేకం. తెలిసిన శాస్త్రాలు కొన్ని. తెలియని శాస్త్రాలు అనేకం. ఇక్కడ ఒక 'మంచి ముహూర్తం'లో ప్రోడక్ట్ తయారు చేయటం ప్రారంభించటం అనేది కూడా ఒక తంత్రమే! ఒక ప్రోడక్ట్‌ని తయారు చేయటానికి ఒక 'యంత్రం' కావాలి. తయారైన ప్రోడక్ట్‌ని ఎప్పుడు మార్కెట్లో విడుదల చేస్తే లాభాలు వస్తాయో గుర్తించగలిగే 'మంత్రాంగం' కావాలి. ఏ వ్యాపారంలో, ఏ వ్యవహారంలో 'ఎటువంటి భాగస్వాములను కలుపుకోవాలి?' అనేది కూడా తంత్రమే!

ఇట్లా యంత్రాలు, మంత్రాలు, తంత్రాలు అనేక రకాలు. వీటికి చాలా విస్తృతార్థం ఉంది. ఏదో రాగిరేకు మీద కొన్ని అక్షరాలు చెక్కేసి అదే ఒక యంత్రం, తంత్రం అనుకోకూడదు. ఒక పాజిటివ్ ఫోర్స్‌ను అనుకూల శక్తిని ఒక మంచి పనికి నమ్మకంగా, స్థిరచిత్తంతో ఆహ్వానించటమే ఇందులో ముఖ్యమైన ప్రక్రియ. సులభంగా, ఎక్కువగా ధనం సంపాదించాలనుకుంటే 'పాజిటివ్ ఫోర్స్'ని(అనుకూల శక్తిని) కూడా వినియోగించాలి. అది ఇంకా ప్రతిభావంతంగా పని చేయటానికి అనుకూల శక్తిని మనం ఆహ్వానించే పద్ధతిలో ఒక తంత్రం ఉంటుంది. మీరు వ్యాపారం చేసే చోట, మీరు నివసించే ఆ స్థలం వాస్తు ప్రకారం అనుకూల ప్రకంపనాలను ఇచ్చేదిగా ఉండాలి. వీలైనంతవరకు వ్యాపారం చేసే క్షేత్రంలో యజమానిగా ఎవరు కూర్చుంటారో ఆ స్థలం లేదా క్షేత్రం పాజిటివ్ వైబ్రేషన్స్‌తో అంటే అనుకూల ప్రకంపనాలతో పుష్టిగా ఉండాలి.

ఇంట్లో పూజ చేసే దగ్గర, గల్లాపెట్టె దగ్గర.. ఇవన్నీ కూడా బాగా పాజిటివ్ వైబ్రేషన్స్ వృద్ధి అయ్యే విధంగా ఉండాలి. అలా ఉండాలంటే ఏం చేయాలి? యజమాని కానీ, అందులో పని చేసేవాళ్లుగానీ ఆఫీసులో కూడా 'వాస్తు ప్రకారం అనుకూలమైన చోట' దీపారాధన తప్పకుండా చేయాలి. ఆ దీపాలు కూడా 24 గంటలు ఉండేటట్లు చూసుకుంటే మంచిది. అలా వీలు కానప్పుడు పొద్దున, సాయంత్రం తప్పకుండా దీపారాధన ఎవరో ఒకరు చేస్తూ ఉండాలి. ఇంకా కొంచెం ఎక్కువ పాజిటివ్ వైబ్రేషన్స్ వృద్ధి చెందటానికి, వాస్తుబలం పెరగటానికి ఇది ఉపయోగపడుతుంది. ఇంకా మంచి రిజల్ట్స్ రావటానికి ఇంకా కొన్ని సాధారణ తాంత్రిక పద్ధతులను ఉపయోగించవచ్చు. ప్రతిరోజూ ఉదయం చేసే పూజలు సూర్యోదయానికి ఒక గంట ముందు లేదా ఒక గంట తర్వాత అంటే ఉదయం ఐదు నుండి ఏడు లోపల అయిపోవాలి. సాయంత్రం చేసే పూజలు సూర్యాస్తమయానికి ఒక గంట ముందు లేదా గంట తర్వాత అంటే సాయంత్రం ఐదు నుండి ఏడు లోపల అయిపోవాలి.

శంఖం లక్ష్మీ స్వరూపం. శంఖానికి లక్ష్మీదేవికి చాలా దగ్గర సంబంధం ఉంది. లక్ష్మీదేవి జలం నుండి ఉద్భవించింది. అలాగే శంఖం కూడా జలము నుంచి పుడుతుంది. శంఖాలలో అనేక రకాలున్నాయి. చాలా చిన్నచిన్న శంఖాలు కూడా లభ్యమవుతాయి. ఇవి దాదాపు ఒక సెంటీమీటర్ కన్నా ఎక్కువ ఉండవు. వీటిల్లో కూడా 'దక్షిణావృత' శంఖాలు కలిగి ఉంటాయి. వీటినే 'లక్ష్మీ శంఖములు' అంటారు. పూజా సామాగ్రి దుకాణాలలో ఇవి దొరికే అవకాశం ఉంటుంది. పూజగదిలో పూజా సమయంలో మనం తీర్థం అమర్చే ఒక వెండి లేక రాగి పాత్రలో జలం ఉంటుంది కదా! ఈ లక్ష్మీ శంఖుని ఆ జలంలో ముంచి పైకి తీసినప్పుడు శంఖులోకి వచ్చిన నీటిని మళ్లీ అదే పాత్రలోకి ధారగా వంపేయాలి. ఇలా 11 సార్లు శంఖును ముంచి, తీసి ఆ పాత్రలోనే నీటిని ధారగా వదులుతూ ఉండాలి. ఈ పని చేసేటప్పుడు తూర్పుకు అభిముఖంగా లేదా పశ్చిమానికి అభిముఖంగా వుండాలి. ఆ సమయంలో ఇష్టదైవాన్ని చిన్నగా ఉచ్చరిస్తూ స్మరించుకోవాలి. ఉదాహరణకి 'హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే'; 'హరే రామ హరే రామ రామ రామ హరే హరే'. శంఖంలో పోస్తే తప్ప తీర్థం కాదు అంటారు కదా! ఇది అట్లాంటిదే అనుకోవచ్చు. ఆ పాత్రలోని జలాన్ని మీరు తీర్థంగా తీసుకోండి. వీలైతే ఉదయం, సాయంత్రం కూడా ఇలా చేస్తే మంచిది. కుదరనప్పుడు ఉదయంపూట ఒక్కసారైనా చేయండి.

ఈ సులభమైన ప్రక్రియను 'ధన ఆకర్షణ తంత్రం'గా పరిగణించవచ్చు. ఈ తంత్రాన్ని మీరు నియమం తప్పకుండా చేయగలిగితే మీ అభివృద్ధి, మీ ధనాభివృద్ధి ఖాయం. మీకు రావలసిన డబ్బులు, వ్యాపారం..మొ॥ అన్నీ మంచి ఫలితాలనిస్తాయి. ఒక అనుకూల శక్తి మీ జీవితంలోకి ప్రవేశిస్తుంది. సత్ఫలితాలు అనుభవంలోకి వస్తూ ఉంటాయి. ఈ ప్రక్రియను మీరు నియమంగా చేస్తూ ఉండటం వల్ల మీరు పది మందికి ఉద్యోగాలు ఇవ్వటం జరిగితే మీ వల్ల కొన్ని కుటుంబాలు జీవన భృతిని పొందుతూ బాగుపడుతూ ఉంటాయి. అయితే ఇది మీరు స్వార్థంతో డబ్బు సంపాదించుకోవటానికి చేస్తున్నామని కాకుండా, మీరు 'పది మందికి ఉపాధి కల్పించే ఉద్దేశంతో, సమాజానికి సేవ చేసే ఉద్దేశంలో చేస్తున్నాం' అని మన సులో సంకల్పం చేసుకోండి. ఫలితాలు మరింత అద్భుతంగా ఉంటాయి.

# వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



దూరపు బంధువుల నుండి కీలక సమాచారం అందుతుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. పూర్వపు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. స్వల్ప ధనలాభం పొందుతారు. కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. రాజకీయాల పట్ల ఆకర్షితులవుతారు.

## వృషభం



వృత్తి వ్యాపారాలలో ఊహించని మార్పులు ఉంటాయి. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. జీవిత భాగస్వామితో ఏర్పడిన విభేదాలు తొలగిపోతాయి. ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో సాంబ్రాణి, త్రిశూల్ పొడితో ధూపం వేయండి. నూతన వస్తువులు, వస్త్రాలు కొను గోలు చేస్తారు. సంఘ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు.

## మిథునం



ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. అనుకోని విధంగా ధన లాభం పొందుతారు. దూర ప్రాంతాల నుంచి శుభవార్తలు వింటారు. ఆకస్మిక ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. జిల్లేడు వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. ఆటంకాలన్నీ తొలగిపోతాయి. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

## కర్కాటకం



వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చిన్ననాటి మిత్రుల నుంచి శుభ వార్తలు వింటారు. దూర ప్రాంతాల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. సాంకేతిక విద్యలపై ఆసక్తి కనబరుస్తారు. సిద్ధగంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామివారికి అర్చన జరిపించండి. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. బంధువులలో మీ మాటలకు విలువ పెరుగుతుంది.

## సింహం



సరికొత్త నిర్ణయాలు తీసుకుంటారు. మీ తండ్రి సమకాలికులను కలుసుకుంటారు. కుటుంబ అవసరాల పైన దృష్టి పెడతారు. ఏదైనా చమత్కారం జరిగి అధిక లాభాలు కలగాలని ఊహాలోకాలలో విహరిస్తారు. బ్యాంక్ వ్యవహారాలలో అప్రమత్తంగా ఉండండి. పరిచయం లేని వ్యక్తులకు అధిక సమాచారం ఇవ్వవద్దు. కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు.

## కన్య



ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. నూతన విద్యా, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. కోటి ఆశలతో కొంతమంది మిమ్మల్ని ఆశ్రయిస్తారు. వారికి మీరు చెయ్యగలిగిన సహాయం చేస్తారు.

## తుల



మానసిక వేదనకు ఏమాత్రం తావివ్వరు. మిమ్మల్ని అంచనా వేయడం మీ సన్నిహిత వర్గానికి కూడా కష్టసాధ్యంగా మారుతుంది. సంఘంలో ఆకర్షణ బిందువుగా ఉండాలనుకుంటారు. నిరంతర కృషి సాగిస్తారు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప ఒడిదుడుకులు తప్పవు. పారిశ్రామిక రంగాల వారికి బాగుంటుంది. క్రయ-విక్రయాలు లాభదాయకంగా ఉంటాయి. లక్ష్మీతామర వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి.

## వృశ్చికం



ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. నూతన విద్యా, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. పెట్టుబడులను తగిన లాభాలు పొందుతారు. క్రయ-విక్రయాలలో లాభాలు పొందుతారు. సన్మాన, సత్కారాలు కార్యక్రమాలలో పాల్గొంటారు. సంతానం విషయం ప్రత్యేకమైన శ్రద్ధ కనబరుస్తారు. వివిధ రకాల అరిష్టాలు, శత్రుబాధలు పోవడానికి త్రిశూలిని ఉపయోగించండి.

## ధనుస్సు



కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సోదరుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. నూతన వస్త్రలాభాలు పొందుతారు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. పోటీ పరీక్షలలో పాల్గొంటారు, మంచి ఫలితాలు సాధిస్తారు. సంగీతం నేర్చుకోవాలన్న ఆకాంక్ష పెరుగుతుంది. విదేశీ అవకాశాలు కలిసి వస్తాయి.

## మకరం



వృత్తి వ్యాపారాలలో ఊహించని మార్పులు ఉంటాయి. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. జీవిత భాగస్వామితో ఏర్పడిన విభేదాలు తొలగిపో తాయి. కుటుంబంలో వత్తిడి అధికంగా వుంటుంది. చెయ్యాలను కున్న పనులు చెయ్యలేక నిరుత్సాహానికి గురవుతారు. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి. కొత్త కార్యక్ర మాలను ప్రారంభిస్తారు. సంఘసేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## కుంభం




విదేశీ అవకాశాలు కలిసి వస్తాయి. కోరికలు చాలా కష్టంమీద నెరవేరుతాయి. బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. సన్నిహితులతో తగాదాలు ఏర్పడవచ్చు, ఓర్పుతో ఉండండి. ఇంట్లో, వ్యాపార ప్రదేశంలో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి. నరదృష్టి తొలగిపోతుంది. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.


## మీనం




ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. అనుకోని అతిథుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. కుటుంబంలో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఇంటా బయటా మీదే పై చేయిగా ఉంటుంది. కాంట్రాక్టులు దక్కుతాయి. లీజు, లైసెన్స్, టెండర్లు లభిస్తాయి. మహా పాశుపత కంకణం ధరించండి.ఉద్యోగం లభిస్తుంది. కొత్త పరిచయాల ద్వారా నూతన విషయాలు తెలుసుకుంటారు. పొదుపు పథకాలు పాటిస్తారు.

# ఈ వారం కా‘ర్టూన్స్’


నేను పక్కాగా ఉంటానోయ్..! నా ఫ్రెండ్స్‌లో
50% జనరల్, 27% ఓబీసీ ఇంకా 15% ....
Zakir


అక్కడికీ చెబుతూనే ఉన్నా.. ఈ ప్రొఫెషన్
వదిలి పాలిటిక్స్‌లోకి వెళ్దాం అని...!!
Zakir...


అలా గుటకలేస్తూ తాగాల్సిన పని లేదండీ
గటగటా తాగినా ఏమి అవదండీ...!!



స్ఫటికంలా
మెరిసే ఈ సరస్సును
గరుడోంగ్మార్ సరస్సు అంటారు.
దీనిని చూడటానికి వెళ్లిన పర్యాటకులు
అరవకూడదు, పరుగెత్తకూడదు .. సరస్సు
దగ్గర ప్రశాంతంగా ఉండాలి.
సిక్కింలో వుందీ సరస్సు.







